


‘సోమశిల’కు పెరిగిన వరద ప్రవాహం

● 2 గేట్లు ఎత్తి నీటి విడుదల



అనంతసాగరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి వస్తున్న వరద పెరిగింది. సోమవారం 12,992 క్యూసెక్కులు వస్తుండగా మంగళవారం 26,750 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో 73.882 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 5, 6 నెంబరు గల గేట్లు ఎత్తి 22,650, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మరోసారి పరిశీలన

● దివ్యాంగ, డీఎంహెచ్‌వో పింఛన్లపై ప్రభుత్వం నిర్ణయం
● ఇటీవల విచారణలో అనర్హులుగా తేలిన 4,250 మంది
● రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తులు ● జిల్లాలో నాలుగు ఆసుపత్రుల్లో పరిశీలన

నెల్లూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ, డీఎంహెచ్‌వో పింఛన్ల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల విచారణలో అనర్హులుగా తేలిన 4,250 పింఛన్లను మరోసారి పరిశీలించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతోపాటు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు ఆదేశాలు అందాయి. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పింఛన్ల రీవెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకూ దివ్యాంగ, డీఎంహెచ్‌వో పింఛన్లను రెండు విడతల్లో వైద్య సిబ్బంది విచారించగా, 4,250 పింఛన్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. వాటన్నింటినీ నిలిపేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనప్పటికీ వివిధ వర్గాలు, పింఛన్‌దారుల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు ఈ నెలలో కూడా వారందరికీ పింఛన్లు అందించింది. ఇటువంటి పింఛన్లన్నింటినీ రీవెరిఫికేషన్ చేసి ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. దీంతో తాజాగా జరగనున్న రీవెరిఫికేషన్ కీలకంగా మారనుంది. జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో ఈ ప్రక్రియ జరగనుంది. నెల్లూరులోని జీజీహెచ్‌తోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరుల్లోని ఏరియా ఆసుపత్రుల్లో రీవెరిఫికేషన్ జరిపేందుకు అధికారులు నిర్ణయించారు. వారంలో మూడు రోజులు అంటే ప్రతీ బుధ, గురు, శుక్రవారాల్లో ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. పింఛన్‌దారులకు ఎప్పుడు రీవెరిఫికేషన్ ఉంటుందన్నది ముందుగానే తెలియజేస్తారు.

అనర్హులుగా 4250 మంది గుర్తింపు

జిల్లాలో సుమారు 3.10 లక్షల పింఛన్లు ఉన్నాయి. అందులో మెజారిటీగా వృద్ధాప్య పింఛన్లు 1.65 లక్షలు ఉండగా, మూడో స్థానంలో డిసేబుల్డ్ పింఛన్లు 32 వేలకు పైగా ఉన్నాయి. అలానే డీఎంహెచ్‌వో పింఛన్లు కూడా సుమారు రెండు వేల వరకూ ఉన్నాయి. డిసేబుల్డ్ పింఛన్ కింద ప్రతీ నెలా రూ.6 వేలను అందిస్తుండగా, డీఎంహెచ్‌వో పింఛన్ కింద రూ.15 వేలను ఇస్తున్నారు. జిల్లాలో ప్రతీ నెలా రూ.131 కోట్లను పింఛన్ల కింద చెల్లిస్తుండగా, అందులో డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్‌దారులకు సుమారు రూ.22 కోట్లను అందిస్తున్నారు. అయితే అనర్హులు కూడా ఈ జాబితాలో పింఛన్లు అందుకుంటున్నట్లు ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వీటిని పరిశీలించగా కొన్ని నిర్ధారణ కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మొదటగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో పింఛన్లను తనిఖీ చేసింది. దొంగ సర్టిఫికెట్లతో కొందరు డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో కేటగిరీల కింద పింఛన్లు పొందుతున్నట్లు తేలింది. దీంతో ఈ ఏడాది జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో కేటగిరీల్లోని పింఛన్లను పరిశీలించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ విచారణ పూర్తయ్యే సరికి జిల్లాలో 4,250 మంది అనర్హులుగా తేలారు. అనర్హులుగా తేలిన వారు మరోసారి పరిశీలనకు ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం అనర్హులుగా తేలిన వారి డిసేబులిటీని రీవెరిఫికేషన్ చేసేందుకు తాజాగా ఆదేశాలిచ్చింది. కాగా ఈ అంశంపై డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి అనర్హులుగా తేలిన పింఛన్లను రీవెరిఫికేషన్ చేయనున్నట్లు చెప్పారు.



వామ్మో.. జ్వరం!

● ఒళ్లు కాలితే చాలు ఆసుపత్రులకు పరుగు
● డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో వణుకు
● 15 వేలకుపైగా కేసుల నమోదు
● స్థానికంగా వైద్యం అందక జిల్లా కేంద్రానికి బాధితులు
● వైద్య ఆరోగ్య శాఖ తీరుపై విమర్శలు
● సీజన్‌పై అవగాహన కల్పించడంలో చేతులెత్తేసిన యంత్రాంగం

8



ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డెంగ్యూ బాధితుడు

గరుడుడిపై ప్రసన్నుడి వైభోగం



బిట్రగుంట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పున్నమి చంద్రుడి వెలుగుల్లో ప్రసన్న వేంకటేశ్వర స్వామివారు మంగళవారం రాత్రి తనకిష్టమైన గరుడుడిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మాస పౌర్ణమి సందర్భంగా కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో జరిగిన ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టరు హిమాన్షు శుక్లా, సబ్ కలెక్టరు హిమవంశీ

సమస్యలన్నీ పరిష్కరిస్తాం!

పరిహారం చెల్లింపులో న్యాయం చేస్తాం

కరేడు రైతులతో కలెక్టర్ హిమాన్షు శుక్లా

- వివరాలు 8లో..

సీజేపై దాడి యత్నం అమానుషం

జిల్లావ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయిపై ఓ న్యాయవాది దాడికి యత్నించడం అమానుషమంటూ మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. న్యాయవాదులు, దళిత సంఘాలు, రాజకీయ నాయకులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నెల్లూరులో న్యాయవాదుల సంఘాలు, సీపీఎం నాయకులు వేర్వేరుగా ఆందోళనలు నిర్వహించారు. కందుకూరులో వివిధ సంఘాలు, రాజకీయ నేతలు అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కావలి, ఉలవపాడు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లోనూ ఆందోళనలు జరిగాయి.



నెల్లూరులో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

ఎవరి పని.. ఎందుకు చంపారు!?

“హలో సార్.. ఇక్కడ జాఫర్‌సాహెబ్ కాలువ బ్రిడ్జిపైన రక్తపు మరకలు ఉన్నాయి. కాలువలో ఓ డెడ్‌బాడీ కూడా ఉంది సార్.’ అంటూ మంగళవారం ఉదయం సంతపేట పోలీసులకు ఓ ఫోన్‌కాల్ వచ్చింది.

అంతే..


పోలీసులకు నిద్రమత్తు వదిలినట్టుంది. వెనువెంటనే సీఐ సహా అందరూ కాలువ వద్దకు చేరిపోయారు. క్రేన్ సహాయంతో కాలువలో నుంచి ఓ మృతదేహాన్ని వెలికి తీశారు. అయితే, అక్కడే రక్తపుఛాయలు ముందుకు వెళుతుండటం గమనించిన పోలీసులు దాని ఆధారంగా ముందుకు సాగారు. సరిగ్గా వంద మీటర్ల దూరంలో మరో మృతదేహాన్ని గుర్తించారు. ఆపసోపాలు పడి ఒకరిని గుర్తించినా, మరొకరు ఎవరనే విషయం తేలకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

● జంట హత్యలతో ఉలిక్కిపడ్డ నగరం
● మృతులిద్దరూ సంచార జాతివారే!
● దొరకని ఆనవాళ్లు
● తలలు పట్టుకుంటున్న పోలీసులు
● వరుస హత్యలతో నగరవాసుల్లో భయాందోళన
● మద్యం, గంజాయి మత్తులో ఘాతుకాలు
● సత్ఫలితాలు ఇవ్వని పోలీసుల చర్యలు

● ఎవరా హంతకులు?

చేపలు పట్టుకుని జీవించే అమాయక సంచార జీవులను పొట్టన పెట్టుకునేంత అవసరం ఎవరికి ఉంది? అసలు ఈ ఘాతుకానికి పాల్పడింది ఎవరు!? గంజాయి మత్తులో ఎవరైనా హత్యలకు పాల్పడ్డారా!? లేదా మరేవైనా కారణాలు ఉన్నాయా!? ఇలా సవాలక్ష ప్రశ్నలు పోలీసులను వేధిస్తున్నాయి.

నెల్లూరులో వరుస హత్యలు జరుగుతుండటంతో నగరవాసులు బీతిల్లిపోతున్నారు. డ్రోన్ కెమెరాలతో నేర నియంత్రణ చేస్తామంటూ ప్రగల్బాలు పలుకుతున్న పోలీసులు ఆచరణలో చేతులెత్తేస్తున్నారు. నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, బెదిరింపులను కూడా కట్టడి చేయలని స్థితిలో ఉన్నారు. స్టేషన్లలో పంచాయితీలు, నాయకులు పంపిన వారికి భజన చేయడంతోనే పోలీసులకు సమయం సరిపోతోందన్న విమర్శలు ఉన్నాయి. ఏదిఏమైనా ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు నగరం ఇప్పుడు నేర చరిత్రకు అడ్డాగా మారిపోతోంది. సోమవారం అర్ధ రాత్రి పెన్నా వంతెనపై జాఫర్ సాహెబ్ కాలువ వద్ద జరిగిన జంట హత్యలతో మరో మారు నగరం ఉలిక్కిపడింది.



కాలువలో నుంచి వెలికితీసిన యువకుడి మృతదేహం

నెల్లూరు (క్రైం) అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెన్నా బ్యారేజీ సమీపంలో తిక్కన పార్కు ఎదుట జాఫర్ కాలువలో ఓ మృతదేహం ఉన్నట్లు మంగళవారం ఉదయం సంతపేట పోలీసులకు ఓ ఫోన్ వచ్చింది. వెంటనే సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు సంఘటన స్థలాన్ని పరిశీలించి జాఫర్ సాహెబ్ కాలువలోని మృతదేహాన్ని వెలికి తీశారు. అయితే అక్కడితో ఆగకుండా ఓ రక్తపు బాట ముందుకు వెళుతుండటం గమనించిన పోలీసులు ఆ బాటలో ముందుకు వెళ్లగా వంద మీటర్ల దూరంలో అదే కాలువలో మరో యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. క్రేన్ సహాయంతో రెండు మృతదేహాలను కాలువలోనుంచి బయటకు తీశారు. మృతుల్లో ఒకరు బాపట్ల ప్రాంతానికి చెందిన సంచారజీవి ఎం పోలయ్యగా గుర్తించారు. తన రెండవ భార్య లక్ష్మితో కలిసి పెన్నా నదిలో ఓ చిన్న గుడారం వేసుకొని పోలయ్య (50) జీవిస్తున్నాడు. రాత్రి పొద్దుపోయాక మరో మృతుడు శివగా పోలీసులు గుర్తించారు. పెన్నా నదిలో చేపలు పట్టుకునే వారిని ఇంత కిరాతకంగా హత్య చేయాల్సిన అవసరం ఎవరికి ఉందన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో ఉండే స్థానికులు మాత్రం నదిలో గంజాయి సేవించే వారే ఈ దారుణానికి పాల్పడి ఉంటారని, గంజాయి మత్తులో చేపల వేటకు వెళుతున్న వారిపై దాడి చేసి హత్య చేసి ఉంటారని చెబుతున్నారు. మరో వైపు దాడి చేసిన ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా పనిచేయక పోవడంతో అసలేం జరిగిందన్నదానిపై పోలీసులు కూడా స్పష్టతకు రాలేక పోతున్నారు. గంజాయి మత్తులో ఐదుగురికిపైగా ఈ దారుణానికి పాల్పడి ఉంటారని తెలుస్తోంది.

● గొడవే కారణమా!?

మరోవైపు హత్యలకు ముందు అక్కడే ఉన్న సబ్‌స్టేషన్ వద్ద గొడవ జరిగిందని, కొందరు వ్యక్తులు ఎవరిపైనో దాడి చేయడం గమనించామని సబ్‌స్టేషన్ సిబ్బంది పోలీసులకు తెలిపినట్లు సమాచారం. గొడవ ప్రారంభమైన ప్రాంతంలో రక్తపు మరకలు, మూడు జతల చెప్పులు, దుప్పటి ఉన్నాయి. అక్కడ నుంచి 50 మీటర్ల దూరంలో తిక్కన పార్కుకు ఎదురుగా ఉన్న వంతెన వద్ద విరిగిపోయిన కర్రలు, రక్తం మీటర్ల దూరం కారిన గుర్తులు, రక్తంతో తడిచిన పాదముద్రలు ఉన్నాయి.

● చిన్న చిన్న కారణాలతోనే..

గతంలో నగరంలో హత్య జరిగింది అంటే అది జిల్లావ్యాప్తంగా ఓ సంచలనంగా మారేది. ఇప్పుడు పది రోజులకు ఒక హత్య అన్నట్లుగా జరుగుతున్నాయి. హత్యలు చేసే వారికి, హత్య కాబడిన వ్యక్తి మధ్య పెద్ద పెద్ద వివాదాలు, ఆస్తి గొడవలు అంటూ ఏమీ లేవు. కేవలం చిన్నపాటి గొడవలతోనే ప్రాణాలు తీసే స్థాయికి చేరిపోతున్నారు. గడిచిన పది నెలల్లో నగరంలో 20కిపైగా హత్యలు జరగటం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది.

● ఉలికిపడ్డ నగరవాసులు

ప్రశాంతతకు నిలయమైన నెల్లూరులో వరుస హత్యలు నగరవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. జరిగే హత్యలు కూడా కిరాతకంగా కత్తులతో నరికి, పొడిచి చంపుతుండటంతో ప్రజలు మనం నగరంలో ఉన్నామా లేదా నేరాలకు అడ్డాగా మారిన రాష్ట్రాల్లో ఉన్నామా అని భీతిల్లుతున్నారు. ఇటీవల వరుసగా జరుగుతున్న హత్యలన్నీ చిన్నచిన్న కారణాలతోనే జరుగుతుండటం, అధికంగా యువతే ప్రాణాలు కోల్పోవడంతోపాటు హత్య చేసిన వారు కూడా యువకులే కావడం చూస్తుంటే యువత ఏ మార్గంలో నడుస్తోందో స్పష్టమవుతోంది.



కాలువ వంతెనపై రక్తపు మరకలు

రౌడీల కదలికలపై దృష్టి పెట్టండి

● జిల్లా పోలీసు అధికారులకు ఐజీ ఆదేశం

నెల్లూరు (క్రైం) : రౌడీల కదలికలు, ఆస్తి, గంజాయి రవాణా, విక్రయాలు, మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని పోలీసు కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఐజీ మాట్లాడారు. జిల్లాలో బేసిక్ పోలీసింగ్ అమలు చేయాలని, డ్రోన్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించి వాటిని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, విలేజ్ విజిట్ చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టే వారిపై నిఘా ఉంచాలని, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ అజిత వేజండ్ల, అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన

పొదలకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై కామర్స్ అధ్యాపకుడు ఏ వెంకటరమణారెడ్డి విద్యార్థులకు వివరించారు. అనంతరం జీఎస్టీపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11483
వెండి కిలో ధర	రూ. 156800
వెండి ఒక గ్రాము	రూ. 160.80

చీఫ్ జస్టిస్‌పై దాడి.. హేయమైన చర్య!

రాపూరు, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రా మకృష్ణ గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారి ప్రతినిధి గోవిందు రంగయ్య మంగళవారం ఒక ప్రక టనలో ఖండించారు. సీజేఐపై దాడి జరగ డం అంటే భారత రాజ్యాంగంపై దాడి జరి గినట్లేనన్నారు. జడ్జిపై బూటు విసిరిన వ్యక్తిపై దేశ ద్రోహం కేసు పెట్టాలని ఆయన డి మాండ్ చేశారు.

కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

మనుబోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కౌలు కార్డుల కోసం రైతులు దరఖాస్తు చేసు కోవాలని తహసీల్దార్ రమాదేవి కోరా రు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళ వారం ఆమె మాట్లాడుతూ గతంలో కౌలు కార్డులు పొందిన రైతులు రెన్యూవల్ చేయిం చుకోవాలన్నారు. అలాగే కొత్తగా కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే కౌలు రైతులు ఆధార్‌కార్డు, లీజు పత్రాలు, ఫోటో, ఇతర పత్రాల నకళ్ళు వీఆర్‌వోలకు ఇవ్వాల న్నారు. కౌలుకార్డుల ద్వారా పలురకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకైతే అదనపు ప్రయోజనాలు ఉన్నాయ న్నారు. కౌలుకు భూమి తీసుకుని సాగుచేసుకునే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గిరిజనులకు ప్రత్యేక ఆధార్ సెంటర్

మనుబోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-1లో నేటినుంచి గిరిజ నుల కోసం ప్రత్యేకంగా ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని పంచాయతీ కార్యదర్శి గరుడయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడురోజుల పాటు ఈ సెంటర్ నడుస్తుందని, ఆధార్‌కార్డు లేని వారు, తప్పులు సరిదిద్దేందుకు, మార్పులు చేసేందుకు గిరిజ నులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

5 గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మనుబోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారిగా ఉన్నట్టుండి మంగళవారం సా యంత్రం వాతావరణం మారింది. చకచకా కారుమబ్బులు కమ్ముకుని, ఈదురు గాలు లు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అయితే గాలులు వీయడంతో సా యంత్రం 4గంటలకు కరెంటు పోయింది. మండలానికి విద్యుత్ సరఫరా అందించే నెల్లూరు, గూడూరు లైన్లు నిలిచిపోవడంతో మండలవ్యాప్తంగా 5 గంటల పాటు సరఫ రా ఆగింది. ఆదిశంకర కళాశాల వద్ద లైన్లు మరమ్మతులు చేసి విద్యుత్ సిబ్బంది విద్యు త్‌ను పునరుద్ధరించారు.

డివిజన్ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగ ణంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డెలీలా ఆధ్వర్యంలో నిర్వ హించారు. కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌కు మండలంలోని వివిధ పాఠ శాలల నుంచి 200మందికి పైగా క్రీడాకా రులు పాల్గొన్నారు. ఎంపికల్లో ప్రతిభ కన బరచిన క్రీడాకారులను డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం లో బుచ్చి నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజామురళి, కౌన్సిలర్లు మల్లారెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, బీవీ రమణ య్య, ఎం దేవిక, పచ్చా తిరుపతయ్య, పి మల్లికార్జునరావు, నాగరాజు, శ్రీనివాసులు, రాజేష్ నాగలక్ష్మి, శ్రీదేవి తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. క్రీడల్లో భాగం గా బుధవారం ఖోఖో, వాలీబాల్, యో గా, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

రాపూరు, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లోని శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మం గళవారం రూ. లక్ష అందిందని ఆలయ అధి కారులు తెలిపారు. నెల్లూరు పట్టణ వాస్త వ్యులు పూవేటి పరంధామి రెడ్డి భార్య అ రుణమ్మ కుటుంబ సభ్యులు శ్రీ వారి నిత్యా న్న దాన పథకానికి ఈ విరాళాన్ని ఆన్‌లైన్ ద్వారా పంపారని ఆలయ ఈవో పోరెడ్డి శ్రీని వాసులు రెడ్డి తెలిపారు.

పిన్నేరు వాగుకు నీరు విడుదల

రాపూరు అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): : కండలేరు జలాశయం నుంచి పిన్నేరు వాగు కు మంగళవారం నీరు విడుదల చేసిన ట్లు డ్యాం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జలాశయం నీటిమట్టం 59 టీఎంసీలకు చేరినట్లు తెలిపారు. డ్యాంకు వచ్చే వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉందని, పిన్నేరు వాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

యూనియ 'నో' బ్యాంకు!

- సోలార్ కాంతులకు బ్యాంకులే అడ్డంకి
- పేదలకు రుణాలు ఇచ్చేందుకు యూనియన్ బ్యాంకు విముఖత



మల్లూరులో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సూర్య ఘర్ సోలార్ సిస్టం

ముత్తుకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : 'సూర్య ఘర్' పథకం కింద సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని స్వయం ఆధారంగా నిలవాలనుకుంటున్న పేదల కలలకు బ్యాంకులు తలుపులు మూసేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు పేదల ఇళ్లలో 'సూర్య ఘర్' పథకం రూపంలో వెలుగులు నింపాలని నిర్ణయిస్తే.. ఆ ఆశల వెలుగులను కాస్త ఆర్పేసి.. బ్యాంకు మేనేజర్లు చీకట్లో కలిపేస్తుండడం బాధాకరం. ప్రధానంగా ముత్తుకూరులోని యూనియన్ బ్యాంకు మేనేజర్ 'సూర్య ఘర్' కింద సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకునేందుకు పేదలు పెట్టుకుంటున్న దరఖా స్తులను నిర్దంద్వంగా తిరస్కరిస్తున్నారని విశ్వసనీయ సమాచారం.

రుణాలకు యూనియ..'నో' బ్యాంక్!

పేదలకు సూర్య ఘర్ పథకం కింద సోలార్ సిస్టం ఏర్పాటు చేయించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఈ ప్రభుత్వ పథకాన్ని విస్తృతంగా ప్రజల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత ఎక్కువగా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసుకుని ప్రజలు ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని మండల నాయకులకు సూచించారు. దీంతో ముత్తుకూరు మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్ గ్రామాల్లో యువకులను ప్రోత్సహించి సోలార్ ప్యానల్స్‌ను సూర్య ఘర్ పథకం కింద ఏర్పాటు చేసుకునేలా ప్రయత్ని స్తున్నారు. అయితే యూనియన్ బ్యాంక్ అధికారుల అలక్ష్య ధోరణి వల్ల ఆ ప్రాంత పరిధిలోని పలువురు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునే రుణాలను పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణంకోసం దరఖాస్తులు చేసుకున్న వారిని డాక్యుమెంట్లు సరికావు.. క్రెడిట్ హిస్టరీ లేదు.. అంటూ తిరస్కరిస్తున్నారు. పేదల కలలకు అడ్డుక ట్టవేస్తున్న ఈ బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్య ధోరణి విని యోగదారులు, ప్రజల్లో ఆగ్రహం రేపుతోంది. ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయని బ్యాంకుల అధికారుల వల్ల మంచి పథకాలు నిర్వీర్యంగా మారుతున్నాయని విమర్శ లు వెల్లు వెత్తుతున్నాయి.

వైసీపీ హయాంలో 'పెద్దోళ్ల'కే రుణాలు!

గత వైసీపీ ప్రభుత్వ హాయంలో రూ.కోట్లలో రుణాలు పెద్దలకు అడ్డంకి లేకుండా ఇచ్చిన బ్యాంకులు, పేదల దగ్గరికి రాగానే నిబంధనల పాఠాలు చెబుతున్నాయి. సూర్య ఘర్ పథకం కింద సబ్సిడీతో అందించే సదుపాయాలు వృథా కావడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామాల్లో పేద కుటుంబాలు రుణం కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతుంటే, అధికారులు తలుపులు మూసేసి కూర్చుంటున్నారు. ప్రభుత్వ పథకమే కదా అంటే ఇంకా ఆర్డర్ రాలేదు.. అని తప్పించుకుంటున్నారు. ఈ బ్యాంకు మేనేజర్ల వ్యవహారం ప్రభుత్వ లక్ష్యాలను నిర్వీర్యం చేస్తోందని స్థానిక ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. పేదలకు ఆర్థిక సహాయం చేయాలనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన ఈ పథకం బ్యాంకుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారిపోతోంది. రైతులు, చిన్న వ్యాపారులు ఆశల బాటల్లో సాగితే రుణాల నిరాకరణతో మళ్లీ చీకట్లో పడుతున్నారు. ఈ బ్యాంకులో పలువురి సూర్య ఘర్ పథకం దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం స్పష్టమైన ఆదే శాలు జారీ చేసి, బ్యాంకులను కట్టడి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 'పథకం పేరేమో 'సూర్య ఘర్'.. కానీ బ్యాంకుల తీరు వల్ల చీకట్లో మునిగిపోతున్నాం' అని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం సంకల్పించిన వెలుగులు, బ్యాంకుల నిర్లక్ష్యంతో చీకట్లో కలవకముందే చర్యలు తీసుకోవాలని పలువురు కోరు తున్నారు. సూర్య ఘర్ పథకం పేదలకు వెలుగుల బాట కావాలంటే, బ్యాంకుల నిర్లక్ష్యానికి చెక్ పెట్టడమే మార్గమని వినియోగదారులు స్పష్టం చేస్తున్నారు.

మూడేళ్ల తర్వాత ఎస్టీ సర్టిఫికెట్లు

- లబ్ధిదారుల్లో ఆనందం



కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరులో అనేక ఏళ్లుగా నివాసం ఉం టున్న ఎస్టీ కుటుంబాలు మంగళవారం సర్వే పల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆయన నివాసంలో కుల ధ్రువీకరణ పత్రా లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ హ యాంలో కుల ధ్రువీకరణ పత్రాల జారీని అధి కారులు నిలిపివేశారన్నారు. అప్పటి ప్రజా ప్రతి నిధులను కలిసినా బాధితులకు న్యాయం జర గలేదన్నారు. జిల్లాలోని అన్నీ మండ లాల్లో ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నా... పొదల కూరులో మాత్రం నిలిపివేశారన్నారు. ఎస్టీలు తన దృష్టి కి సమస్యను తీసుకురావ డంతో జిల్లా ఉన్న తాధికారుల ద్వారా సమస్య పరిష్క రించా మన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కయ్యనాయుడు, తలచీరు మస్తాన్ బాబు, బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, తదిత రులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడును కలిసిన కలెక్టర్, ఎమ్మెల్యే సోమిరెడ్డి



వెంకయ్యనాయుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



వెంకయ్యకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

వెంకటాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని మంగళవారం సాయంత్రం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మర్యాదపూర్వ కంగా కలిశారు. పలు విషయాలపై చర్చించా రు. పలువురు టీడీపీ నేతలున్నారు.

కలెక్టర్ హిమాన్షు శుక్లా..

పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడిని మంగళవారం ఉదయం స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకయ్యకు పుష్పగుచ్ఛాన్ని అంద జేశారు. పలు అంశాలపై చర్చించారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భవాని

రాపూరు, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ప్రసన్న అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వ యంతో కలిసి పనిచేసి రాపూరు మండ లాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమా వేశంలో సభ్యులు పలు సమస్యలు లేవ నెత్తారు. కుక్కలు, పందుల బెడద అధికంగా ఉందని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యాశాఖ ఆధీనంలో 300 సైకిళ్ళు నిరూపయోగంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేయాలని కోరారు. టీటీడీ కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలని కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ కోరారు. రాపూరు నుండి నెల్లూరుకు ప్రయాణికులు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సర్వీసులు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవానీ, జెడ్పీటీసీ ప్రసన్న, టీడీపీ మండలాధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, వైస్ ఎంపీపీ పెంచల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని గిరిజనుల వినతి

వెంకటాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : తమ భూములను ఆక్రమిం చేందుకు యత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయా లంటూ గిరిజనులు వేడుకు న్నారు. వెంకటా చలంలోని రెవెన్యూ కార్యా లయంలో మంగళ వారం సాయంత్రం తహసీల్దార్ శ్రీనివాసు లుకు సర్వేపల్లి పంచాయతీ నాగంబొట్లవారి కండ్రిగ గిరిజనులు వినతి పత్రాన్ని అందజే శారు. వారు మాట్లాడుతూ సర్వేపల్లి పంచా యతీ నాగంబొట్లవారికండ్రిగ వద్ద తమకు గత ప్రభుత్వాలు భూములు కేటాయించి పట్టాలు ఇచ్చాయన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి తామే ఆ భూములను సాగు చేసుకుంటున్నా మన్నారు. ఇప్పుడు ఈ భూమి తనదంటూ విజయ రాజు అనే వ్యక్తి వచ్చి తమను బెదిరించి రోడ్డు వేసి విగ్రహాన్ని నిర్మిస్తున్నారని, తాము వెళ్లి అడగగా తమపై కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారని, ఇవి తమ భూములేనని, తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థా యి లో విచారించి తమకు న్యాయం చేయా లని కోరారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసులు స్పందిస్తూ భూములోకి దిగరాదని, క్షేత్రస్థా యిలో విచారించిన తర్వాతే భూములోకి దిగాలని హెచ్చ రించారు.

సొంత నిధులతో ర్యాంపు నిర్మాణం

ఉదయగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్ట ణంలోని షబ్బీర్ కాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠ శాలలో దెబ్బతిన్న ర్యాంపును విద్యార్థుల సౌక ర్యార్థం ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో ర్యాంపు నిర్మించారు. తరగతి గది నిర్మాణ సమ యంలో నిర్మించి న ర్యాంపు దెబ్బతిని కూలి పోయి రాళ్లు తేలడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు పడుతుండేవారు.

కౌన్సిల్‌లో 9 అజెండాలకు ఆమోదం



పారిశుధ్య కార్మికురాలు నరసమ్మను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్,కమిషనర్

బుచ్చిరెడ్డి పాళెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డి పాళెం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన 9 అజెండాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి తెలిపారు. మంగళవారం నగ ర పంచాయతీ కార్యాల యంలోని కౌన్సిల్‌హాల్లో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమా వేశంలో ప్రవేశపెట్టిన 9 అజెండాలకు ఆమోదం తెలిపిన కౌన్సిల్ సభ్యులకు చైర్‌పర్సన్ ధన్యవాదాలు తెలిపారు. పలువురు కౌన్సిలర్లు వార్డుల విభజనపై అభ్యంతరాలు తెలిపారు. ఈమేరకు కమిషనర్ బాలకృష్ణ కౌన్సిల్ సభ్యులకు వార్డుల విభజనపై నగర పంచాయతీ నైసర్గిక స్వరూపాన్ని వీడియో ద్వారా వివరించారు. సభ్యులు అభ్యంతరాల మేరకు సరిదిద్దుతామని తెలిపారు. సమావేశం అనంతరం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న బుచ్చి మెప్మా ఆర్పీ షేక్ షబ్బానం, మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికురాలు నరసమ్మను సత్కరించారు.

ఆశ్రమ ఈవోపై అసత్య ఆరోపణలు సరికాదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి



వెంకటాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గొలగ మూడి భగవాన్ శ్రీ వెంక య్య స్వామి ఆశ్రమ ఈఓ బాలసుబ్రహ్మణ్యంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి అన్నారు. వెంకటా చలంలోని ఆపార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావే శంలో మాట్లాడారు. గత ఇరవై ఏళ్లగా బాలసుబ్రహ్మణ్యం ఈఓగా ఆశ్రమాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేశారన్నారు. అలాంటి ఈఓపై వెంకయ్యస్వామి కుటుంబీకులమంటూ కొందరు అసత్య ఆరోపణలు చేయడం సరికాద న్నారు. ఆశ్రమ అభివృద్ధికి బాలసుబ్రహ్మణ్యం ఎనలేని కృషి చేశారన్నారు. ఒక రుపాయి కూడా జీతం తీసుకోకుండా సేవ చేస్తున్న ఈఓపై నిరా ధారణమైన ఆరోపణలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈఓకు బీజేపీ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిడిగుంట పాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు అసనాపురం శ్రీనివాసులు, నేతలు ఆరు ముళ్ల మురళీ, వేణుగోపాల్‌రెడ్డి, గోత్తల నరేష్, కరీముల్లా పాల్గొన్నారు.

జీఎస్టీపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచనపోటీలను పరిశీలిస్తున్న ఎంఈవో ఓబులు

మనుబోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జీఎస్టీపై పిల్లలకు అవగాహన క ల్పించేందుకు ఉన్నత పాఠ శాలలో మంగళవారం వి ద్యార్థినీ, విద్యార్థులకు పలు రకాల పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలను మనుబోలు బాలు ర, బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ఎంఈవో ఓబులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 7 ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించామన్నారు. ప్రతి విభాగం నుంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేస్తారన్నారు. వీరికి మండలస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. అమూల్యకుమారి, కార్యదర్శి శ్రావణి పాల్గొన్నారు.

అడవులను కాపాడాలి

సీతారామపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అడవులను కాపాడాలని, వన్యప్రాణుల ను రక్షించాలని అటవీశాఖ డీఆర్‌వో కేవీ ప్రసాదు కోరారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో 71వ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ, వాటి ఆవశ్యకత, పర్యావరణ సమతుల్యత, అంతరించిపోతున్న జాతుల వల్ల మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉండడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

దుత్తలూరు (ఉదయగిరి), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత పేర్కొన్నారు. మంగళవారం దుత్తలూ రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆశ డే కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలన్నారు. ఇంటింటా లార్వా సర్వే చేపట్టి దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు.



పొదలకూరులో వెలసిన అక్రమ లేఅవుట్

ఎల్ఆర్ఎస్‌కు దూరం!

- గడువు ముగుస్తున్నా ముందుకు రాని రియల్టర్లు
- నుడా చైర్మన్ హెచ్చరికలు బేఖాతరు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రియల్టర్లు సద్వినియోగం చేసుకోవడం లేదు. గతానికి భిన్నంగా ప్రభుత్వం రాయితీలు కల్పించినా, క్రమబద్ధీకరణకు స్పందన ఉండడం లేదు. ప్లాట్లు అమ్మేశాం... మాకు ఏమవుతుందిలే....అన్న ధీమా కొందరిది. అయితే అక్రమ లేఅవుట్లకు స్థానిక ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇచ్చాం. వారి అండ మాకుందిలే క్రమబద్ధీకరణకు వెళ్లకపోతే ఏమవుతుందిలే అన్న ధీమా మరికొందరిలో ఉండగా, లేఅవుట్లల్లో ఎంతో కొంత ప్రభుత్వ స్థలాలు ఉన్నందున క్రమబద్ధీకరణకు పోతే అవి బయటపడి అసలికే ముప్పు వస్తుందన్న భయంతో మరికొందరు క్రమబద్ధీకరణకు దూరంగా ఉంటు న్నారు. దీంతో మంచి ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ పథకం నీరుగారుతోంది.

● ఎల్ఆర్ఎస్‌కు స్పందన కరువు

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీగా ఆదాయం గడించారు. అలాగే అధికారులు, ప్రజాప్రతినిధులకు అక్రమ లేఅవుట్లల్లో భారీగానే ముడుపులు ముట్టాయి. దీంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి జంకూబొంకూ లేకుండా యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేశారు. నుడా పరిధిలోని 8 నియోజకవర్గాల్లో 427 అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేశారు. వీటిలో పెద్దఎత్తున ప్లాట్లను ప్రజలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. అయితే అక్రమ లేఅవుట్ల వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండిపడడంతోపాటు కొనుగోలుదారులకు ఇబ్బందులు ఉండడంతో దీనిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక దృష్టి సారించింది. కొనుగోలుదారులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయం పెంచేలా నిర్ణయం తీసుకుని ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరణ పొంది ఇళ్లకు ప్లాన్లు తీసుకోవాలంటే స్థలం మార్కెట్ ధరలో 14 శాతం సొమ్మును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే దానికి 50 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో కేవలం 7 శాతం మార్కెట్ ధరను చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టి మూడు నెలలలోపు దరఖాస్తులు చేసుకోవచ్చు అని గడువును నిర్ణయించింది. అయితే ఆ గడువు ఈనెల 23తో ముగుస్తున్నప్పటికి రియల్‌ఎస్టేట్ వ్యాపారులలో స్పందన కరువైంది. నుడా పరిధిలో 427 అక్రమ లేఅవుట్లు ఉన్నప్పటికి ఇప్పటికి కేవలం 188 ప్లాట్లు లేఅవుట్లదారులు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. నుడా పరిధిలోని 30 ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు ఉండగా కేవలం 14 ప్రాంతాల నుంచి మాత్రమే అరకొరగా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వీటికి కూడా ఇప్పటి వరకు క్రమబద్ధీకరణకు ఆమోద ముద్ర పడలేదు.

● చైర్మన్ హెచ్చరికలు బేఖాతారు

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ద్వారా నుడాకు రూ.కోట్లాది రుపాయల ఆదాయం రావాల్సి ఉంది. అలాగే ప్లాట్లు కొనుగోలుదారుల అందరికి వారి ప్లాట్లపై పూర్తి అనుమతులు ఏర్పడనున్నాయి. అయితే ఎల్ఆర్ఎస్ పథకం గడువు మరో 15 రోజుల్లో ముగుస్తున్నప్పటికి అక్రమ లేఅవుట్‌దారుల్లో స్పందన కనబడుటలేదు. దీనిపై ఇటీవల నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పత్రికా సమావేశం ఏర్పాటు చేసి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. క్రమబద్ధీకరణకు ముందుకు రాకపోతే భవిష్యత్తులో మళ్లీ క్రమబద్ధీకరణ ఉండదని, లేఅవుట్లను ధ్వంసం చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. అయినా స్పందన నామమాత్రంగానే ఉంటుండడంతో అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. అసలు అక్రమ లేఅవుట్‌దారుల ధైర్యం ఏమిటని ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గడువు ముగిసే లోపైన అక్రమ లేఅవుట్‌దారులు దరఖాస్తులు చేసుకుంటారో లేక తమకు ఇబ్బంది ఉండదన్న భరోసాగా ఉంటారో వెచ్చిచూడాల్సి ఉంది.



ప్రమాదానికి కారణమైన కారు

అర్ధరాత్రి కారు బీభత్సం

- రెండు మోటారు బైకుల ధ్వంసం

అనంతసాగరం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట వద్ద సోమవారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. ఆత్మకూరు-సోమశిల ప్రధాన రహదారి లింగంగుంట రచ్చ వద్ద రోడ్డు మార్జిన్‌లో రెండు మోటారు బైకులు, ఒక కారు పార్క్ చేశారు. ఏపీ 39ఎల్ 07672 నెంబరు కారు వేగంగా రావడంతో అదుపు తప్పి బైకులను ఢీకొంది. దీంతో 10 నుంచి 20 అడుగుల దూరంలో బైకులు ఎగిరి పడ్డాయి. పార్కింగ్ చేసిన కారు పాక్షికంగా దెబ్బ తినింది. ఘటన స్థలంలో పెద్ద రాళ్లు ఉండడంతో వాటిని ఢీకొని కారు ఆగిపోయింది. పగలు రద్దీగా ఉన్నప్పుడు ఈ ఘటన జరిగి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని, కారు డ్రైవరును గుర్తించి పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఊటుకూరులో వ్యక్తిపై దాడి

విడవలూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలు మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిపై విచాక్షణారహితంగా దాడి చేసిన సంఘటన మండలపరిధిలోని ఊటుకూరు గ్రామం కంచరపాళెంలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు ఊటుకూరు గ్రామానికి చెందిన విడవలూరు ప్రసాద్ మద్యం సేవించి గ్రామంలో గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కొర్ర వెంకయ్య, విడవలూరు ప్రసాద్ మధ్య కొంతకాలంగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మంగళవారం వాటర్ క్యాన్ ఇంటికి తీసుకుని పోతున్న వెంకయ్యను విడవలూరు ప్రసాద్ అడ్డగించి మారణాయుధంతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకయ్యను స్థానికులు 108లో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టి కేసుని నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహాత్మాగాంధీ నగర్ కృష్ణమందిరంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. అర్చకుడు బీ శ్రీనివాసాచార్యులు భక్తులతో వ్రతం చేయించారు. ఉభయకర్తలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణీ, మల్లేశ్వరీ వ్యవహరించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ పర్యవేక్షించింది.





నగరంపై కమ్ముకున్న వాన మబ్బులు

కుండపోత వర్షం

- నగరంలో ఉరుములు, పిడుగుల మోత
- పలుప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన వర్షపునీరు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : నగరంలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుం చి ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్నానికి మారిపోయింది. ఆకా శం మేఘాలతో కమ్ముకుంది. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ప్రారంభమైన భారీ వర్షం కారణంగా రహదారులు నీట మునిగా యి. ఉరుములు, పిడుగుల మోతతో నగరం దద్దరిల్లింది. ముత్తు కూరు రోడ్డు, ట్రంకురోడ్డు బాబు జగజ్జీవన్ రాం నగర్, రాయాజీ వీధి ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వర్షంతో జిల్లా వ్యాప్తంగా చల్లని వాతావరణం ఏర్పడింది. ఇటీవల ఎండలు మండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో ప్రజలు ఆనందపడ్డారు. వర్షం కారణంగా చల్లని గాలులు వీచి వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో వర్షం రాకతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరి, పత్తి తదితర పంటలు వేసిన వారికి ఈ వర్షం కొంత ఉపయోగకరంగా మారింది. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నగరపాలక సంస్థ అధికారులు రోడ్లపై నీరు లేకుండా చర్యలు చేపట్టారు. వర్షం తరువాత రహదారులపై పిల్లలు ఆటలతో సందడి చేశారు. మొత్తం మీద ఈ వర్షం వలన ఎండవేడి, ఉక్కపోతతో సతమతమవుతున్న జిల్లా ప్రజలకు ఉపశమనం కలిగింది.



నగరంలో కురుస్తున్న వర్షం

అవినీతి అధికారులపై
చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణ శాఖలో అవినీతికి సంబంధించి సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకునే ముందు అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రజారోగ్య శాఖ డిప్యూటీ ఎస్ఈకి విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ శాఖ ఎండీ కార్యాలయం నుంచి నెల్లూరు అర్బన్‌లోని ఆరుగురు సచివాలయ సిబ్బందిపై చర్యలకు ఉత్తర్వులు వెలువడ్డాయని, అవినీతికి బాధ్యులైన అధికారులపై తొలుత చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశాన వాటికకు ప్రహరీ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, పక్కన నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బుజబు జ నెల్లూరులో ఉన్న శ్మశానానికి రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణం కోసం మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. కర్మ క్రతువుల భవనం లేక అనేక ఏళ్లుగా బుజబుజ నెల్లూరు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వంలో ఈ భవనాన్ని నిర్మించామని చెప్పారు. ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు అందించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జెన్ని రమణయ్య, కార్పొరేటర్ బద్దెపూడి నరసింహ, శేష యాదవ్, మాతంగి కృష్ణ, బ్రహ్మారెడ్డి, నగళ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం లో మృతిచెందిన జనసైనికుడు బ్రహ్మయ్య కుటుంబానికి జనసేన పార్టీ జిల్లా పర్యవేక్షకుడు, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ ఆర్థిక సాయం అందించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్మకూరుకు చెందిన జనసైనికుడు బ్రహ్మయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ తరపున రూ.60 వేలు సాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, చిట్టమూరు ప్రవీణ్‌రెడ్డి, సుందర్‌రామిరెడ్డి, గునుకుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సీజేపై దాడి యత్నం అమానుషం : సీపీఎం



ఆర్టీసీ వద్ద నిరసన తెలియచేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై మతోన్మాదులు దాడికి యత్నించడం అమానుషమంటూ సీపీఎం ఆందోళన చేపట్టింది. మంగళవారం నగరంలోని ఆర్టీసీ కూడలిలో పార్టీ నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ సీజేపై మతోన్మాది కాలిబూటు విసరటం దారుణమన్నారు. ఆర్ఎస్ఎస్ సంఘం పరివార్ వ్యాప్తి చేసిన విద్వేషానికి ఇది నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పెంచల నర్సయ్య, అబ్దుల్ అజీజ్, సతీష్, సుధాకర్, కోటేశ్వరరావు, మాలకొండయ్య, సుధీర్, ఈశ్వరయ్య, కృష్ణమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్‌లెస్

- జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ భవనంపై నీలినీడలు
- నిర్మాణం పూర్తయినా స్వాధీనం చేసుకోని సూపరింటెండెంట్
- స్వాధీనం చేస్తామని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చెప్పినా ససేమిరా
- డీఎంఈకి రిపోర్టు చేసిన ప్రిన్సిపాల్

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ భవనం వినియోగంలోకి రావడంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈ భవంతి అందుబాటులోకి వస్తే అదనంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే, రెండు పడకల తల్లీబిడ్డల గది, 5 పడకల ఎమర్జెన్సీ విభాగం, రెండు పడకల చిన్నపిల్లల విభాగాలు ఏర్పాటు చేస్తారు. అలాగే 30 పడకల సాధారణ రోగుల వార్డు, 10 పడకల ఐసీయూ అందుబాటులోకి వస్తాయి. భవన నిర్మాణం పూర్తయినా స్వాధీనం చేసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోగులకు మెరుగైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది.

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మూడేళ్ల క్రితం క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి సంకల్పించారు. అయితే రాష్ట్రంలో అప్పుడున్న వైసీపీ ప్రభుత్వం ఈ నిర్మాణంపై నిర్లక్ష్యం ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు విడుదల చేయగా మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంది. కానీ నాటి పాలకులు నిధుల విడుదలలో జాప్యం చేయడంతో నిర్మాణం ఆగిపోయింది. కేంద్రం నిధులు వెనక్కు పోతాయన్న ఆలోచనతో 2023 మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని కేంద్రం నిధులతో ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయటంతో కదలిక వచ్చింది. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా భవన నిర్మాణంతోపాటు ఆధునిక వైద్య పరికరాల కోసం ప్రభుత్వాలు రూ. 23.75 కోట్లు కేటాయించాయి. 51 వేల చదరపు అడుగుల స్థలంలో మూడు అంతస్తుల భవనం రూపుదిద్దుకుంది. ఈ భవనంలో క్రిటికల్ కేర్‌తోపాటు పలు విభాగాలు ఏర్పాటు చేసేలా నిర్మాణం చేపట్టారు. రెండవ అంతస్తులో స్టెరిలైజేషన్‌తోపాటు రెండు ఆధునాతన ఆపరేషన్ థియేటర్లు నిర్మించారు.



నిర్మాణం పూర్తయిన క్రిటికల్ కేర్ విభాగం భవనం

ఆధునిక పరికరాలు

నూతన క్రిటికల్ కేర్ విభాగానికి కావాల్సిన ఆధునిక పరికరాలలో 80 శాతం ఇప్పటికే చేరుకున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. జనరల్ ఆసుపత్రిలో 750 పడకలు ఉండగా మరో 50 పడకలు నూతన భవనంలో అందుబాటులోకి రానున్నాయి. ఇందులో చిన్నపిలలతోపాటు సాధారణ రోగులకు కూడా అత్యాధునిక వైద్య చికిత్సలు అందించవచ్చు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన క్రిటికల్ కేర్ భవనం స్వాధీనానికి అధికారులు కొర్రీలు పెడుతున్నట్లు సమాచారం.

తీసుకోవడానికి ససేమిరా...

క్రిటికల్ కేర్ భవన నిర్మాణ బాధ్యతలు ఆంధ్రప్రదేశ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) చేపట్టి కాస్త ఆలస్యంగా అయినా పూర్తి చేసింది. దీనిని గత నెలలో ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరికి అప్పగించింది. వెంటనే భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా నిర్వహణ కోసం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవికి అప్పగించాలని ప్రిన్సిపాల్ భావించారు. అయితే భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు సూపరింటెండెంట్ సుముఖంగా లేరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణం జరగలేదని, అందుకే స్వాధీనం చేసుకునేం దుకు నిరాకరిస్తున్నారని సమాచారం. కాగా, తొలుత భవనం స్వాధీనం చేసుకుని వైద్య సేవలు మొదలు పెడితే చిన్నచిన్న సమస్యలు పరిష్కరిం చుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. కానీ భవనం స్వాధీనానికి సూపరింటెండెంట్ ససేమిరా అంటున్నట్లు తెలిసింది. మొత్తంగా రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనం అధికారుల వైఖరితో నిరుపయోగంగా మారుతోంది.

భవనాన్ని స్వాధీనం చేసుకోలేదు

క్రిటికల్ కేర్ భవనాన్ని నాకు ఏపీఎంఎస్ఐడీసీ అప్పగిం చింది. వెంటనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఈ భవనం నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని సూచించాము. అయితే సూపరింటెండెంట్ ఈ భవనం స్వాధీనానికి నిరాకరిస్తున్నారు. నూతన భవనంలో అన్నీ సదుపాయాలు ఉన్నాయి. ఓపీ విభాగాన్ని వెంటనే ఏర్పాటు చేసుకోవచ్చు. భవనాన్ని స్వాధీనం చేసుకోకపోవటంతో డీఎంఈకి రిపోర్టు చేశాం.



- డాక్టర్ రాజేశ్వరి,
ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది

వైసీపీ ప్రభుత్వంలో ఈ క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి అనేక అవరోధాలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు విడుదల చేసి నిర్మాణం త్వరగా పూర్తి చేశారు. పలు వైద్య పరికరాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ భవనంలో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించవచ్చు. గత ఆగస్టు నెలలోనే భవనం అందుబాటులోకి వస్తుందని భావించాం. ఎందుకనో రాలేదు. జాప్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. వెంటనే క్రిటికల్ కేర్ భవనాన్ని అందుబాటులోకి తేవాలి.



- మడపర్తి శ్రీనివాసులు, జీజీహెచ్
అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్

జడ్పీలో వాల్మీకి మహర్షికి నివాళి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వ హించారు. వాల్మీకి చిత్రపటానికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, అధికారు లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో...

నగరంలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్ఈ కే రాఘవేంద్రం మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, పర్సనల్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాపై
దృష్టి సారించాలి

- ఎస్ఈ రాఘవేంద్రం



మాట్లాడుతున్న ఎస్ఈ రాఘవేంద్రం

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాణ్యమైన, అంతరాయంలేని విద్యుత్ సరఫరా చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్ శాఖ అధికారులను ఎస్ఈ కే రాఘవేంద్రం ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆ బాధ్యత విద్యుత్ అధికారులు, సిబ్బందేనన్నారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ అమలును వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్ చౌదరి, బెనర్జీ, భాను నాయక్ పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవ జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఉపాధ్యాయ హక్కుల కోసం ఫ్యాప్టో ఆందోళన

నెల్లూరు (విద్య), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ హక్కుల కోసం విజయవాడ ధర్నా చౌక్ వద్ద మంగళవారం పోరుబాట నిరసన ధర్నా చేపట్టామని ఫ్యాప్టో జిల్లా నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. బోధనకు పరిమితం చేయాలని తాము కోరుతున్నా బోధనేతర పనులు అప్పగించి తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని విమర్శించారు. మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రూ.30వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించడంతో పాటు ప్లస్ టూ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అలాగే పురపాలక ఉపాధ్యాయులకు పీపీఎఫ్ సౌకర్యం, అర్బన్ ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలన్నారు. సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. గురుకుల, ఆదర్శ, 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, అంతర్ జిల్లాల బదిలీల్లో స్పౌజ్ కేటగిరి కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ కే మధుసూదన్, సెక్రటరీ జనరల్ జావీద్, కోచైర్మన్లు మురళీకృష్ణ, మాన ప్రసాద్, మాధవ, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ శేషులు, నరసింహం, హజరత్, పిచ్చిబాబు, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు

ఆయలూరు సత్రం నిర్వహణ అధ్వానం

- ఎలాంటి కార్యక్రమాలు లేక బోసిపోయిన వైనం
- పట్టించుకోని బ్రాహ్మణ కార్పొరేషన్
- దాత వెంకయ్య పంతులు ఆశయాలకు నీళ్లు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రేబాలవారి వీధిలో ఉన్న ఆయలూరు వెంకయ్య పంతులు సత్రం నిర్వహణ అధ్వానంగా ఉంది. దేవదాయ శాఖ నుంచి బ్రాహ్మణ కార్పొరేషన్ పరిధిలోకి రావడంతో దాత ఆయలూరు వెంకయ్య పంతులు ఆశయాలకు నీళ్లు వదిలారు. వెంకయ్య పంతులు నగరంలోని స్థిరాస్తి, పొలాలను సామాజిక సేవల కోసం దేవదాయ శాఖకు అప్పగించారు. ఆయన ఆశయాల మేరకు విద్యా, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని వీలునామా రాశారు. దాని ప్రకారం నిత్య అన్నదానం, బాటసారులకు చలివేంద్రం, వేసవిలో మజ్జిగ చలివేంద్రం వంటివి ఏర్పాటుతోపాటు సంస్కృత పాఠశాల నిర్వహణ, జిల్లాలోని వివిధ పాఠశాలల్లో సంస్కృతం చదువుకుంటున్న విద్యార్థులకు ఏడాదికి ఒక మారు స్కాలర్‌షిప్‌లతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలి. దాత ఆశయాల మేరకు దేవదాయ శాఖ అధికారులు 10 సంవత్సరాల క్రితం వరకు నామమాత్రంగానైనా ఆ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏ కులానికి చెందిన సత్రాలు, ఆలయాలు ఆ కులం వారే నిర్వహించుకునేలా జీవో జారీ చేశారు. ఆ జీవో ప్రకారం నగరానికి చెందిన బ్రాహ్మణ ప్రముఖుడు, చార్టెడ్ అకౌంటెంట్ శంకర నారాయణ ఆధ్వర్యంలో పోరాటం చేసి తెలుగుదేశం ప్రభుత్వంలో వెంకయ్య పంతులు సత్రాన్ని బ్రాహ్మణుల పరిధిలోకి తెచ్చుకున్నారు. ఆ తర్వాత బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఎలాంటి కార్యక్రమాలు లేక సత్రం బోసిపోయింది.

ఆ సత్రం గోడకు మాత్రం మాగాణి భూములు 449ఎకరాలు, 2పుట్ల 12తూముల 8 ముంతలు కౌలు, 11 దుకాణాలు, గోడౌన్ల ద్వారా అద్దె ఆదాయం రూ.1,78,668, నేల బాడుగలు 92 అంకణాలకు అద్దె ఆదాయం రూ.48.520, ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.31లక్షలు అని దేవదాయ శాఖ పరిధిలో ఉన్నప్పటి వివరాలు ఉన్నాయి. బ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆయలూరు వెంకయ్యపంతులు సత్రం సమాచారం అందించే వారేలేకపోవడం గమనార్హం. ఈ సత్రంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి దాత ఆశయాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



స్టోన్‌హౌస్‌పేటలోని వెంకయ్య పంతులు సత్రం భవనం



వైద్యశాలలో 12 సవర్ల బంగారం చోరీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తల్లికి అనారోగ్యంగా ఉండటంతో ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించిన కుమార్తె బ్యాగులో నుంచి గుర్తుతెలియని దుండగుడు బంగారు నగలు దోచుకెళ్లిన ఘటనపై మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని శెట్టిగుంటరోడ్డు ప్రాంతంలో రామయ్య, శైలజ దంపతులు నివసిస్తున్నారు. శైలజ తల్లి మస్తానమ్మ అనారోగ్యానికి గురవడంతో పదిరోజుల కిందట విజయమహల్ గేటు సమీపంలోని జీకే వైద్యశాలలో చేర్చారు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో వారింట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు కూడా తమ వెంట తెచ్చుకున్నారు. ఆ బంగారు ఆభరణాలను దుస్తుల బ్యాగులో భద్రపరుచుకున్నారు. మస్తానమ్మ ఆరోగ్యం కుదుటపడటంతో సోమవారం రాత్రి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అప్పటికే రాత్రి అవడంతో మంగళవారం డిశ్చార్జ్ అవుతామని చెప్పి మస్తానమ్మ కుటుంబ సభ్యులు వైద్యశాలలోనే నిద్రించారు. ఉదయం నిద్రలేచి చూసేసరికి శైలజ బ్యాగులో ఉండాల్సిన 12 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితురాలు వైద్యశాల యాజమాన్యానికి చెప్పడంతో వారు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఉదయం 3.30 నిమిషాల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వైద్యశాలలోకి ప్రవేశించి శైలజ ఉన్న గదిలోకి వెళ్లడాన్ని గుర్తించారు. బాధితురాలు బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


దీనావస్థలో వృద్ధురాలు సుబ్బమ్మ

మా ఇంటికి చేర్చండయ్యా!

● రోడ్డుపై వృద్ధురాలి వేదన ● చలించిన డిప్యూటీ తహసీల్దార్
● చేయూతనందించిన రెవెన్యూ సిబ్బంది

కట్టుకున్నోడు పోయాడు. కడుపున పుట్టిన బిడ్డ చనిపోయాడు. నా.. అన్న వాళ్లే రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు. ఏడు పదులు దాటిన ఓ వృద్ధురాలు కాలువిరిగి నడవలేక, రోడ్డుపై పాక్కుంటూ రెండురోజులుగా మనుబోలులో ప్రభుత్వ కార్యాలయాల వద్ద దైన్యంగా కాలం గడుపుతోంది. కనిపించిన వారినల్లా పదో, పరకో అడుక్కుంటూ తనను ఇంటికి పంపాలంటూ కాళ్లావేళ్లా పడుతోంది. మంగళవారం ఆమె దీనగాథ విన్న డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ చలించిపోయారు. రెవెన్యూ సిబ్బందిని పంపి రోడ్డుపై ఉన్న వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో సిబ్బంది ఆమెను సమీపంలోని బస్‌షెల్టర్‌కు తీసుకెళ్లారు. తన పేరు సుబ్బమ్మ అని, కలువాయి సొంతూరని చెప్పింది. భర్త కొండయ్య. కుమారుడు 25 ఏళ్ల క్రితమే చనిపోయాడు. ఇద్దరు కుమార్తెలు. తనను ఎవరూ పట్టించుకోలేదని, తన మనవడు సుబ్బయ్య ఆటోలో ఇక్కడికి తీసుకువచ్చి వదిలి వెళ్కాడని రోదిస్తోంది. కలువాయిలో కరెంటు ఆఫీసు వద్ద తనకు ఇల్లు ఉందని, తనను అక్కడకు చేర్చాలని వేడుకుంటోంది. దీంతో డీటీ ప్రదీప్ కలువాయి తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు. స్థానికులు వృద్ధురాలికి ఆహారం, దుస్తులు అందించారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)


సుబ్బమ్మను బస్సు షెల్టర్‌కు మోసుకెళుతున్న రెవెన్యూ సిబ్బంది

19న ఎల్‌ఐసీ ఏజెంట్ల మహాసభలు

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎల్‌ఐసీఏఓఐ) నెల్లూరు డివిజన్ 6వ మహాసభలు ఈనెల 19న కందుకూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెజవాడ శివయ్య, సీహెచ్ నరసింహారావులు తెలిపారు. మంగళవారం స్థానిక బ్రాంచి కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థను రక్షించుకోటానికి, ఏజెంట్ల హక్కుల సాధనకు, రాబోయే కాలంలో నిర్వహించబోయే పోరాటాలకు రూపకల్పన చేయటం కోసం ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు షబ్బీర్, విష్ణువర్ధన్‌రెడ్డి, బి. మధుబాబు, పిచ్చయ్య, మాల్యాద్రి, రాజేశ్వరాచారి, సి. మాలకొండయ్య, బి. వెంకట్రావు, కె. వెంకటేశ్వర్లు, ఆర్. హజరత్‌రెడ్డి, యం. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో పైసలిస్తేనే ఫైళ్ల కదలిక

● ప్రతి దస్త్రానికి రేటు పెట్టి.. డిమాండ్ చేసి వసూళ్లు

కావలి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి) కావలి డివిజన్‌లో తహసీల్దార్‌కార్యాలయాలతోపాటు ఆర్డీవో కార్యాలయంలో కూడా పైసలిస్తేనే ఫైళ్లు కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తెచ్చినా భూసమస్యలు ఎప్పటికప్పుడు పుట్టుకొస్తుంటాయి. ఆ సమస్యలు పరిష్కరించుకోవాలంటే సచివాలయాలు, మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో అప్లయిచేసుకోవాలి. అనంతరం ఆయా కార్యాలయాలో ఆ ఫైళ్లు కదలాలంటే సంబంధిత సిబ్బందిని కలిసి పైసలు ముట్ట చెప్పుకోవాల్సిందే. లేదంటే ఏదో ఒక సమస్య చూపి వాటిని రిజక్ట్ చేస్తుంటారు. తహసీల్దార్ కార్యాలయాల్లో పైసలిచ్చి ఫైళ్లు కదిలించినా ఆర్డీవో కార్యాలయానికి వచ్చేసరికి ఇక్కడ కూడా పైసలివ్వనిదే ఫైలు కదలటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

● బరితెగించి వసూళ్లు

ఆర్డీవో కార్యాలయంలో ఉన్న ఒక ఉద్యోగి మరీ బరితెగించి వసూలు చేస్తుండటంతో ఆయనపై ఇటీవల కొందరు ఎమ్మెల్యేకు చెప్పినట్లు తెలిసింది. వెంటనే ఎమ్మెల్యే ఆర్డీవోకు ఫోన్‌చేసి ఎవరా ఉద్యోగి ఏమిటీ ఆరోపణలు అని అడగ్గా, ఇక నుంచి అలా జరగకుండా చూసుకుంటామని ఆర్డీవో చెప్పినట్లు తెలిసింది. ఎక్కువగా భూమార్పిడిలలో తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయం మరీ పోటీ పడి వసూళ్లు వసూళ్ల ఆరోపణలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం భూమార్పిడిని ప్రభుత్వం నిలుపుదల చేయటంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వారు తమ రాబడి పోయిందే అని బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

● ప్రతీచోటా వసూల్ రాజాలు

ప్రతీ కార్యాలయంలో కలెక్షన్‌ల కోసం ఆరితేరిన ఒక ఉద్యోగిని ఆ కార్యాలయ అధికారులు ఎంపిక చేసుకుని ఉంచుకుంటారు. ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలకు సంబంధించి మీడియేటర్లు అయినా, అసలు బాధితులైనా నేరుగా ఆ ఉద్యోగిని కలిసి పైసలిస్తేనే ఆ ఫైలుకు మోక్షం కలుగుతోంది.

నా దృష్టికి వచ్చింది : ఆర్డీవో

ఆర్డీవో కార్యాలయంలో భూమార్పిడికి ఓ ఉద్యోగి డబ్బులు అడిగారని తన దృష్టికి వచ్చిందని ఆర్డీవో తెలిపారు, ఇక నుంచి అలా జరగకుండా చూస్తామన్నారు.

వామ్మో.. జ్వరం!

● ఒళ్లు కాలితే చాలు ఆసుపత్రులకు పరుగు ● డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో వణుకు ● స్థానికంగా వైద్యం అందక జిల్లా కేంద్రానికి బాధితులు

ఉదయగిరికి చెందిన ఎనిమిదేళ్ల విక్రాంత్ (8) జ్వరంతో బాధపడుతూ స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించున్నారు. ఎంతకూ జ్వరం తగ్గక పోవటంతో గత నెల 29వ తేదీన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించగా టైఫాయిడ్ అని తేలింది. దీంతో వైద్యుని సూచనల మేరకు ఆ చిన్నారి చికత్స పొందుతుంది.

దుత్తలూరు మండలానికి చెందిన వెంకటసుబ్బయ్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్నా జ్వరం లేదు. ఇక లాభం లేదని నెల్లూరులోని ఓ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆయనకు డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. వెంటనే వైద్యచికిత్సలు చేయగా ప్రస్తుతం కోలుకుంటున్నాడు.

కావలి రూరల్ మండలానికి చెందిన సుధాకర్ అనారోగ్యానికి గురయ్యాడు. తీరా పూర్తిస్థాయి పరీక్షలు చేయగా సుధాకర్‌కు మలేరియా సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో వైద్యులు వెంటనే చికిత్సలు చేయగా ప్రస్తుతం కోలుకుంటున్నాడు.


జీజీహెచ్‌లో రక్తపరీక్షల కోసం బాధితుల క్యూ

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటం, జ్వరాలకు ఇదే సీజన్ కావటంలో జిల్లాలో బాధితుల సంఖ్య వేలల్లోనే ఉంటోంది. గత ఏడాదితో పోలిస్తే కొంతవరకు జ్వరాలు తగ్గాయని వైద్యులు చెబుతున్నా.. అసలు తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జ్వరపీడితులే రావటం లేదని, కేసులు తక్కువగా ఉన్నాయని పీహెచ్‌సీ వైద్యులు చెబుతున్నా నమోదవుతున్న జ్వరాలపై తగిన సమాధానం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్థుల్లో జ్వరాల కేసులే 40 శాతం ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా గత వారం రోజుల్లో ఆయా పీహెచ్‌సీల పరిధిలో 100 మందికిపైగా జ్వర బాధితులు ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక ఏరియా, జిల్లా ఆసుపత్రులతో పాటు నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజూ వేల మందికిపైగా వివిధ రకాల రోగులు వస్తుండగా వీరిలో జ్వరపీడితులు ఎక్కువగానే ఉన్నారు. ఇక జిల్లాలో 2వేలకుపైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా ఇక్కడకు వచ్చే రోగులలో జ్వరపీడితుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 15 వేలకు మందికిపైగా జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సీజన్‌లో జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నా వైద్య ఆరోగ్య శాఖ తగిన ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపట్టటంలో విఫలమవుతోందన్న విమర్శలు ఉన్నాయి.

● ఆందోళన కలిగిస్తున్న విషజ్వరాలు

జిల్లాలో నమోదయ్యే జ్వరాలలో విషజ్వరాలు నమోదు కావటం ఆందోళన కలిగించే అంశమే. ప్రస్తుతం డెంగ్యూతోపాటు మలేరియా వ్యాధి గ్రస్తులు పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వీటన్నిటి కంటే టైఫాయిడ్ బాధితులు వందల సంఖ్యలో నమోదవుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, రాపూరు, ఆత్మకూరు, అల్లూరు, నెల్లూరు, ఇందుకూరుపేట తదితర మండలాల్లో జ్వర పీడితులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఆయా మండలాలలో ప్రత్యేకించి డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. అధికారులు మాత్రం డెంగ్యూ కేసులు తక్కువగా ఉన్నాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా ఉంది. ప్రైవేట్ ఆసుపత్రులలో నమోదయ్యే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ కేసుల వివరాలు వైద్యాధికారులు ఎప్పటికప్పుడు సేకరించాల్సి ఉన్నా ఆ దిశగా మాత్రం చర్యలు లేవు.

● మూడు పరీక్షలు తప్పదా..

జ్వరం వచ్చిన వారు తప్పనిసరిగా కరోనా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాల్సి వస్తోంది. ఆ తర్వాత టైఫాయిడ్, డెంగ్యూ నిర్ధారణ పరీక్ష చేసుకుంటున్నారు. ఇలా మూడు రకాల పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుండంతో జ్వరపీడితులపై ఆర్థిక భారం ఎక్కువైంది. పీహెచ్‌సీలలో ఇలాంటి అన్ని రకాల పరీక్షలు అందుబాటులో లేక పోవటంతో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లకు పరుగులు తీస్తున్నారు.

● అవగాహన ఏదీ!?

వైద్య ఆరోగ్య శాఖ ప్రజా వైద్యం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా వ్యాధులపై మాత్రం అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందుతోంది. వ్యాధులపై అవగాహన కల్పించే అధికారులు, సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. ప్రత్యేకించి ఈ సీజన్‌లో డిసెంబరు వరకు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో దోమల సంఖ్య కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

● దోమల నివారణపై దృష్టి ఏదీ!?

దోమల నివారణపై ఇటు పాలకులు, అటు అధికారులు చేతులెత్తేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉండటంతో మురికి కాలువలు, గుంతలు, నీటి నిల్వ కేంద్రాలు దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారుతున్నాయి. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు మున్సిపాలిటీలతో పంచాయతీలు పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో పారిశుధ్యం లోపించి రోగాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే మురికి నీటి కాలువల నిర్మాణాలు, పరిశుభ్రత చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడంలేదు. ఒక ప్రణాళికా బద్ధంగా వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చేపట్టాలని ప్రభుత్వం మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నా అవి క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోడంలేదు.



విష జ్వరాలు నమోదవుతున్నాయి

వర్షాల కారణంగా జ్వరాలు వస్తున్నాయి. ఎక్కువగా డెంగ్యూ కేసులను గుర్తిస్తున్నాము. సాధారణ జ్వరం అని ఏదో ఒక మందులు వాడి తగ్గిందని నిర్ధారించుకోవద్దు. తప్పని సరిగా వైద్యులను కలిసి చికిత్స చేయించుకోవాలి. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ జరిగి జ్వరపీడితులు పూర్తిగా కోలుకుంటారు.

- డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ వైద్యుడు

తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం

జిల్లాలో విషజ్వరాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం ఎప్పటి కప్పుడు సమీక్షలు చేపట్టి జ్వరాలు ప్రబలకుండా నివారిస్తున్నాం. జ్వరాలు అదుపులోనే ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి వైద్యులు చికిత్సలు అందిస్తారు. దీన్ని సద్వినియోగం చుసుకోవాలి.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



మహిళల దిశ మార్చేలా..

● త్వరలో మరో రెండు పథకాలు
● ఒకటి విద్యా లక్ష్మి, రెండోది ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి
● పావలావడ్డీతో రుణ సౌకర్యం

కోవూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం పలు కొత్త పథకాల్ని ప్రవేశపెట్టి జిల్లాలోని మహిళాలోకానికి ఉపాధి చూపేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. జిల్లాలోని 4,06,145 సంఘబంధాల సభ్యులైన మహిళలకు త్వరలోనే రెండు పథకాల్ని ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. సంఘబంధాల్లోని సభ్యుల కుమార్తెల విద్యకోసం 'ఎన్టీఆర్ విద్యాలక్ష్మి' యువతుల వివాహాలకు ఆర్థికసహాయం అందించేందుకు వీలుగా 'ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి' పథకాన్ని విస్తరించనున్నారు. రెండుపథకాలకు పావలా వడ్డీతో రుణసదుపాయం కల్పించేందుకు వీలుగా బ్యాంకులకు సమాచారం అందించారు. పేదరిక నిర్మూలన సొసైటీ ఆధ్వర్యంలో రెండు పథకాలకు ఆర్థికసహాయం అందించాలని భావిస్తున్నారు. తక్కువ వడ్డీతో రుణసదుపాయం కల్పిస్తున్నందు వల్ల ప్రభుత్వం నుంచి మహిళలకు చేయూత లభించే అవకాశముంది.

● ఆడబిడ్డల చదువుకు...

బాలికల చదువు కోసం పావలా వడ్డీతో రుణసహాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కుటుంబంలో ఇద్దరు బాలికల చదువుకు రూ10,000 నుంచి రూ లక్ష వరకు రుణసదుపాయం కల్పించనున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చెల్లించే ఫీజులవివరాల్ని సమాఖ్య కార్యాలయాల్లో నమోదుపరచి రుణం పొందే వీలుంది. విద్యార్థినులకు అందించే రుణసదుపాయం ఉన్నత విద్య అభ్యసించే వారికి చాలా మేలు చేకూర్చనుంది.

● పెళ్లి ఖర్చులకు..

పొదుపు సభ్యురాలి కుమార్తె పెళ్లి ఖర్చులకు రుణసదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెళ్లి ఖర్చులకు రూ 10,000 నుంచి రూ 1,00,000 వరకు రుణసదుపాయం కల్పించనున్నారు. రుణాన్ని 48వాయిదాల్లో తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పించారు. పావలా వడ్డీ నిర్ణయించడంతో సభ్యులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే అవకాశముంది. వివాహ విషయాన్ని సూచించే పెండ్లి పత్రిక, ఖర్చుల పట్టీల్ని సంఘ బంధాల్లో నమోదుచేసుకోవాలి. సంబంధిత డ్వాక్రా అధికారి పరిశీలించి సభ్యురాలి ఖాతాలో రుణాన్ని జమచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

● బాధిత మహిళలకు రుణ విముక్తి

కొత్తగా ప్రవేశపెట్టే రెండు పథకాల్లో రుణ సదుపాయం పొందిన మహిళలు ప్రమాదవశాత్తుతో, అనారోగ్యంతో మృతి చెందితే రుణం తిరిగి చెల్లించకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో రుణసదుపాయం పొందిన మహిళ మృతి చెందితే కుటుంబ సభ్యులు రుణం మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాల్సి వచ్చేది. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించి కుటుంబసభ్యులపై ఒత్తిడి లేకుండా నిర్ణయం తీసుకుంది.

10న సీఎం చంద్రబాబు రాక

వెంకటాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో తాటిపర్తిపాళెం వద్ద నూతనంగా ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ఈ నెల 10న సీఎం చంద్రబాబు నాయుడు రానున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి హెలీపాడ్, రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా అధికారులు మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబు పర్యటన అధికారికంగా బుధవారం ఖరారు కానున్నట్లు సమాచారం.

శిక్షణతో హస్త కళాకారులకు ఉపాధి

● తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ ఏడీ

ఉదయగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించి, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయమని తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో గల చెక్కనగిషీ కేంద్రంలో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ, అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ వారు హస్తకళాకారులకు అందించనున్న శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హస్తకళల అభివృద్ధిలో భాగంగా కళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రానికి డెవలప్‌మెంట్ కమిషనర్ న్యూఢిల్లీ వారు రూ.14 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కేంద్రంలో 30 మంది హస్తకళాకారులకు ఐదు నెలలపాటు టెక్నికల్, డిజైన్ డెవలప్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్‌పై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ సమయంలో కళాకారులకు భృతి అందచేస్తారని తెలిపారు. కళాకారులు తయారు చేసిన వస్తువులు ప్రపంచవ్యాప్తంగా విక్రయించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ అధికారులు దివాకర్, యేసురాముడు, శ్రీనివాసరావు, చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రమణయ్య, మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్ షాహిదా, కేంద్రం నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ ఏడీ సత్యనారాయణమూర్తి

సీతారామపురం ఉపాధ్యాయినికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు

సీతారామపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీతారామపురం గ్రామ పంచాయతీలోని సంగసానిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని అజుబా పవిత్రకుమారికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డును ప్రకటించింది. ఏఐసీఎఫ్ ఫౌండర్ గడ్డపాటి విజయరాజు, తెలంగాణ స్టేట్ మైనార్టీస్ కమిషన్ వైస్‌చైర్మన్ శంకర్ లూక్ చేతుల మీదుగా హైదరాబాదులో మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.


నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయిని అజుబా పవిత్ర కుమారి

పరిహారం చెల్లింపులో సమస్యలు పరిష్కరిస్తాం

కరేడు రైతులతో కలెక్టరు హిమాన్షు శుక్లా

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తామని జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో పరిశ్రమలకు భూములిచ్చిన రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. కరేడు పరిధిలో భూములు కలిగి ఉన్న రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, ఉలవపాడు, కరేడు గ్రామాలకు సంబంధించిన రైతులతో పాటు చేవూరు, రావూరు గ్రామాలకు సంబంధించిన పలువురు రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూములు ఇండోసోల్ కంపెనీకి ఇచ్చినప్పటికీ పరిహారం చెల్లింపులో ఎదురవుతున్న సమస్యలను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టరు శుక్లా మాట్లాడుతూ రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లా స్థాయి నెగోషియేషన్ కమిటీలో కూడా చర్చించి రైతులకు ఎంతమేరకు నగదు చెల్లించాల్సి ఉందో ఆమేరకు వారి ఖాతాలకు జమచేసేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ, భూసేకరణ ప్రత్యేక అధికారులు రాజశేఖర్, శివకుమార్, ఉలవపాడు తహసీల్దారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టరు హిమాన్షు శుక్లా, సబ్ కలెక్టరు హిమవంశీ

బ్రహ్మర్షి వాల్మీకికి కలెక్టర్ నివాళి

బ్రహ్మర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సబ్ కలెక్టరు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా, కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీలు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

రామాయణాన్ని అందించిన మహర్షి వాల్మీకి : జేసీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి, నీతి, ధర్మం, కరుణ వంటి విలువలతో కూడిన రామాయణ మహాకావ్యాన్ని మానవాళికి అందించిన మహర్షి వాల్మీకి అని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్ర మం జరిగింది. వాల్మీకి చిత్రపటానికి అధికారులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో జేసీ మాట్లాడుతూ మానవుని జీవన విధానానికి, ధర్మపాలనకు నిలువెత్తు సాక్షాత్కారం రామయణమని చెప్పారు. సాధారణ మనిషి నుంచి ఒక మహా రుషిగా ఎదిగిన వాల్మీకి జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శమన్నారు. కాగా, నెల్లూరు నగరంలో వాల్మీకి విగ్రహం, వాల్మీకి భవనం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బీసీ సంఘాల వారు జేసీని కోరారు. నగరంలో బీసీ భవన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని జేసీ సమాధానమిచ్చారు. బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్ర మంలో మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, దేవరాల సుబ్రహ్మణ్యం, బీసీ కోటయ్య, జనార్దన్, కాలేషా, బుధవారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో నివాళి

నెల్లూరు(క్రైం): రామాయణం స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పిలుపు నిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, బీసీ సంఘ నాయకులు

నెల్లూరులో న్యాయవాదుల నిరసన

నెల్లూరు (లీగల్), అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడి చేయడాన్ని నిరసిస్తూ ఐలు జిల్లా కమిటీ, ఐక్య వేదిక, వివిధ సంఘాల న్యాయవాదుల ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఒక న్యాయవాది తన బూటును విసిరి సనాతన ధర్మం వర్ధిల్లాలి అంటూ మాట్లాడిన ఘటనను వారు తీ వ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు ఎస్. అంకయ్య, ప్రధాన కార్యదర్శి చుక్కా రమేష్ , సీనియర్ న్యాయవాదులు కుడుముల రమేష్, బద్దేపూడి రవీంద్ర, స్వర్ణా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● నేడు విధుల బహిష్కరణ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడి చేయడాన్ని నిరసిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసనను తెలియజేయాలని నెల్లూరు బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం సమావేశమైన బార్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నదని, అందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులిమి అయ్యప్పరెడ్డి, నక్కల నాగరాజు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

బాబోయ్.. శునకాలు !


ఏఎస్‌పేట, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): ప్రముఖ యాత్రాస్థలమైన ఏఎస్ పేటలో విచ్చల విడిగా శునకాలు సంచరిస్తుండడంతో గ్రామస్తులు, భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు. వీధుల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతూ కనిపించినవారిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. దీంతో మహిళలు, పిల్లలు ఒంటరిగా బజారుకు వెళ్లాడానికి భయపడుతున్నారు. చేతిలో సంచులను లాగేస్తూ వెంటపడి కరుస్తున్నాయి. ఇప్పటికే శునకాల దాడిలో పలువురు గాయపడ్డారు. వీధికుక్కల దెబ్బకు దర్గాకు వచ్చే భక్తులు సైతం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను గ్రామానికి దూరంగా తరలించాలి.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11483
వెండి కిలో ధర	రూ. 156800
వెండి ఒక గ్రాము	రూ. 160.80

కంపచెట్ల తొలగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుబోయమడగలలో విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా అల్లుకుపోయిన కంపచెట్లను లైన్‌మెన్ జే చందుముదిరాజ్ తొలగించి శుభ్రం చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న నిర్లక్ష్యం కథనానికి స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా ఆదేశాల మేరకు ఆయన గ్రామానికి చేరుకొని స్తంభాల చుట్టూరా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చేశారు. దీంతో సమీప నివాసాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్తంభం చుట్టూ తొలగించిన కంపచెట్లు

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



ఉదయగిరి : వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

ఉదయగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎల్.రామ్మోహన్, టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి పద్మజ, బీజేపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మానవుని నుంచి మహర్షిగా మారి హిందువుల్లో రామనామ స్ఫూర్తిని నింపిన వ్యక్తి వాల్మీకి అన్నారు. ఆయన్ను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకుని అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, బీజేపీ నాయకులు ఆవుల రోశయ్యయాదవ్, చల్లా సుబ్బరత్నం, మస్తాన్, వెంకటయ్య, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సంగం : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జ్యోతి, వీర్వోలు, పాల్గొన్నారు.



వరికుంటపాడులో నివాళులర్పిస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్, తదితరులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు పసుపులేటి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని మానవాళికి అందిం చిన మహనీయుడు ఆయనేనని కొనియా డారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒ క్కరూ తమవంతు బాధ్యతగా కృషి చే యాలన్నారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ హర్షద్‌అహమ్మద్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలతో కూడిన విద్యనందించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు నైపుణ్యాలతో కూడిన విద్యనందించాలని ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాల ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను ఎఫ్ఏ-2 పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న తరగతి గదుల పనులు, రిజిస్టర్లు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎంఈవోను సన్మానించారు. అలాగే ఎంఈవో-1 టీ.శ్రీనివాసులు మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ మహ్మద్‌కరీం, చల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత



వైద్యుడితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత పేర్కొన్నారు. మంగళవారం దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆశ డే కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలన్నారు. ఇంటింటా లార్వా సర్వే చేపట్టి దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల వైద్యశాల పనితీరుపై విమర్శలు వస్తున్నాయని, 24 గంటలు వైద్యశాల తప్పనిసరిగా తెరిచి ఉంచి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి అఖిల్, సీహెచ్‌వో ఓంకారయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు పద్మ, ఖాజామొహిద్దీన్, నారాయణ, రాజు, అరాఫత్‌అలీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమి ప్రతాపం చూపించినప్పటికీ ఆపై ఆకాశంలో కమ్ముకున్న మేఘాలతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించడంతో ఏ క్షణంలో ఎలాంటి పరిస్థితులు సంభవిస్తాయోనని ప్రజలు భయాందోళనతో బెంబేలెత్తిపోయారు. రోజుల తరబడి ఎండ ప్రభావాన్ని తట్టుకోలేని ప్రజలు, మూగజీవాలకు కొంతమేర ఊరట లభించింది. అలాగే మెట్ట పంటలకు సైతం వర్షం సానుకూలంగా మారుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

వింజమూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంఖవరం సచివాలయంలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ డీఆర్‌పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ పరిధిలో జరిగిన సుమారు రూ.34లక్షల పనులు వివరాలను తెలిపారు. అలాగే గ్రామంలోని 350 జాబ్ కార్డుదారులు చేసిన పని వివరాలను తెలియజేశారు. ఈనెల 10న స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో జరిగే బహిరంగ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూమిరెడ్డి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు బోగిరెడ్డి వెంకటరమణారెడ్డి, హజరత్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అజయ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఎడగారులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఆయన నూతనంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు మహిమలూరు రైతు సేవా కేంద్రం వద్ద రెండురోజులుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాంకేతిక సమస్యతో ఆగిపోవడంతో ఆయన అధికారులు, రైతులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆగి ఉన్న ధాన్యం లారీలను వెంటనే పంపాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు రైతుల సౌకర్యార్థం ఆత్మకూరు ఏఎంసీ కార్యాలయం వద్ద నూతనంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఆత్మకూరు పరిసర ప్రాంతాల రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. రైతులు 7337359375 నెంబరుకు ఫోన్ చేసినా, వాట్సప్ మెసేజ్ చేసినా ప్రభుత్వ ఉద్యోగి నేరుగా రైతు వద్దకే వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. ఆత్మకూరులోని సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ అధికారులను నేరుగా సంప్రదించినా ధాన్యం కొనుగోలుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఏ- గ్రేడు ధాన్యం పుట్టి రూ. 20,360 గిట్టుబాటు ధర కల్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, ఏఎంసీ కార్యదర్శి కృష్ణప్రసాద్, సివిల్ సప్లయ్స్ ఏఎం లక్ష్మీనారాయణ, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ ఎండీ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు ఘటనపై న్యాయవాదుల నిరసన



ఆత్మకూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆత్మకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నాన్ని ఖండిస్తూ ఆత్మకూరు బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. న్యాయవ్యవస్థ, రాజ్యాంగం, లౌకికవాదాన్ని పరిరక్షించాలని స్థానిక కోర్టు ఆవరణ నుంచి మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలియజేశారు. సీనియర్ న్యాయవాది కేవీ శేషారెడ్డి తదితరులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేశ్ కిశోర్ దాడికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్, సీనియర్ న్యాయవాదులు ఎల్‌వీ రమణయ్య, నజీర్, నంద ఓబులేశు, తిరుపతమ్మ, మధు తదితరులు పాల్గొన్నారు. నిరసనలో ప్రజాసంఘాలనాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి యత్నంపై సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ షేక్ సందాని, సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు కె డేవిడ్‌రాజు, జి లక్ష్మీపతి, కేసీ కృష్ణయ్య, మహ్మద్ సాదిక్‌హుస్సేన్, పి యస్థానీ, వాగాల శ్రీహరి, షేక్ అనకవర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలి : రైతు సంఘం



మాట్లాడుతున్న జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు శ్రీరాములు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తాగు, సాగు నీటి వసతి కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు అన్నారు. మంగళవారం వరికుంటపాడులో నిర్వహించిన మండల రైతు సంఘం మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మెట్ట ప్రాంత ప్రజలు, రైతులకు వరప్రసాదినిగా మారిన వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నక్కలగండి రిజర్వాయర్‌తో పాటు గండిపాళెం జలాశయం 5వ నంబరు కాలువ మరమ్మతు పనులను వెంటనే చేపట్టి సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం కార్యదర్శి కాకు వెంకటయ్య, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి కోడె రమణయ్య, మండల కన్వీనర్ మట్టి హరినారాయణ, మండల రైతుసంఘం అధ్యక్షులు పావులూరి నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్త చంచల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

- మండల కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో రైతుసంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడుగా పావులూరి నాగేశ్వరరావు, కార్యదర్శిగా కంచర్ల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా చీర్లదిన్నె నాగేశ్వరరావు, కోశాధికారిగా రావిళ్ల సుబ్బారావు, సభ్యులుగా ఆంధ్ర ప్రసాద్‌రెడ్డి, కామినేని ఎరుకలయ్య, మాదాల భూమయ్యలను ఎన్నుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులకు పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రైతు సమస్యలపై పోరాటం చేస్తామని కమిటీ పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ అడవులను కాపాడాలి

సీతారామపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అడవులను కాపాడాలని, వన్యప్రాణులను రక్షించాలని అటవీశాఖ డీఆర్‌వో కేవీ ప్రసాదు కోరారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో 71వ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ, వాటి ఆవశ్యకత, పర్యావరణ సమతుల్యత, అంతరించిపోతున్న జాతుల వల్ల మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉండడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలువులు మాట్లాడుతూ నీటి అవసరాల కోసం నివాస ప్రాంతాల్లోకి వచ్చే అటవీ వన్యమృగాల పట్ల ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, అటవీశాఖ ఎఫ్‌బీవోలు ప్రసాద్, గౌతమ్, కరిముల్లా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత నిధులతో ర్యాంపు నిర్మాణం



ఉపాధ్యాయుల సొంత నిధులతో నిర్మించిన తరగతి గది ర్యాంపు

ఉదయగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షబ్బీర్ కాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో దెబ్బతిన్న ర్యాంపును విద్యార్థుల సౌకర్యార్థం ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో ర్యాంపు నిర్మించారు. తరగతి గది నిర్మాణ సమయంలో నిర్మించిన ర్యాంపు దెబ్బతిని కూలిపోయి రాళ్లు తేలడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు సందానిబేగం, గాజుల మున్నలు తమ సొంత నిధులు రూ.30 వేలు వెచ్చించి ర్యాంపు నిర్మాణం చేపట్టారు. అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న కంపచెట్లు, రాళ్లు ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించి మట్టి తోలి చదును చేయించి విద్యార్థులు ఆటలాడుకునేలా చర్యలు చేపట్టారు. పాఠశాల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో ఎస్ఎంసీ, దాతల సహాయంతో ప్రహరి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

రాజరాజేశ్వరిదేవి ఆలయంలో లలితా రుద్ర హోమం



లలితా రుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు

సంగం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమనకొండలో వెలసిన శ్రీరాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని 15వ రోజు లలితా రుద్ర హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో లలితా రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి మాట్లాడుతూ ప్రజలు ధ్యాన, జ్ఞాన మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన పది కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి చేయూతను అందించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కొరికి రూ. 10 వేల చొప్పున పది కుటుంబాలకు కలిపి లక్ష రూపాయలు మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. 1వ వార్డు పరిధిలోని మొలబంటి మాలకొండయ్య, 2వ వార్డు షేక్ అహ్మద్‌బాష, 3వ వార్డు కల్లె చక్రప్ప, 5వ వార్డు షేక్ ఖాదర్‌హుస్సేన్, 7వ వార్డు సయ్యద్ ఖాసింబీ, 9వ వార్డు పెళ్లూరు విశ్వనాథం, 15వ వార్డు షేక్ సుల్తాన్‌మొహిద్దీన్, 16వ వార్డు రాగి పెంచలమ్మ, 22వ వార్డు వింజమూరు పెద్దరంగయ్య, 23వ వార్డు తురిమెర్ల ప్రభాకర్ కుటుంబాలను పరమేశ్వరరెడ్డి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో తమను ఆదుకున్న పరమేశ్వరరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ పైపులైన్ పగిలి నీటికి కటకట

వింజమూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమిట్ట ప్రాంతంలో పంచాయతీ పైపులైన్ పగిలి ఆ ప్రాంతవాసుల తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడింది. వారం రోజులుగా పైపులైన్ పగిలిపోయిందని, దీని గురించి ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల నీటి సమస్య ఏర్పడిందని స్థానికులు వాపోయారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా, వారు అదిగో.. ఇదిగో.. అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారని వారు పేర్కొన్నారు. దీంతో పశువులకు, ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. ఈ విషయంపై ఈవో రామారావుని వివరణ కోరగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



పొదలకూరులో వెలసిన అక్రమ లేఅవుట్

ఎల్‌ఆర్‌ఎస్‌కు దూరం!

- గడువు ముగుస్తున్నా ముందుకు రాని రియల్టర్లు
- నుడా చైర్మన్ హెచ్చరికలు బేఖాతరు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రియల్టర్లు సద్వినియోగం చేసుకోవడం లేదు. గతానికి భిన్నంగా ప్రభుత్వం రాయితీలు కల్పించినా, క్రమబద్ధీకరణకు స్పందన ఉండడం లేదు. ప్లాట్లు అమ్మేశాం... మాకు ఏమవుతుందిలే...అన్న ధీమా కొందరిది. అయితే అక్రమ లేఅవుట్లకు స్థానిక ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇచ్చాం. వారి అండ మాకుందిలే క్రమబద్ధీకరణకు వెళ్లకపోతే ఏమవుతుందిలే అన్న ధీమా మరికొందరిలో ఉండగా, లేఅవుట్లల్లో ఎంతో కొంత ప్రభుత్వ స్థలాలు ఉన్నందున క్రమబద్ధీకరణకు పోతే అవి బయటపడి అసలికే ముప్పు వస్తుందన్న భయంతో మరికొందరు క్రమబద్ధీకరణకు దూరంగా ఉంటున్నారు. దీంతో మంచి ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ పథకం నీరుగారుతోంది.

- **ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన కరువు**

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీగా ఆదాయం గడించారు. అలాగే అధికారులు, ప్రజాప్రతినిధులకు అక్రమ లేఅవుట్లల్లో భారీగానే ముడుపులు ముట్టాయి. దీంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి జంకుబొంకూ లేకుండా యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేశారు. నుడా పరిధిలోని 8 నియోజకవర్గాల్లో 427 అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేశారు. వీటిలో పెద్దఎత్తున ప్లాట్లను ప్రజలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. అయితే అక్రమ లేఅవుట్ల వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండిపడడంతోపాటు కొనుగోలుదారులకు ఇబ్బందులు ఉండడంతో దీనిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక దృష్టి సారించింది. కొనుగోలుదారులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయం పెంచేలా నిర్ణయం తీసుకుని ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరణ పొంది ఇళ్లకు ప్లాన్లు తీసుకోవాలంటే స్థలం మార్కెట్ ధరలో 14 శాతం సొమ్మును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే దానికి 50 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో కేవలం 7 శాతం మార్కెట్ ధరను చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టి మూడు నెలలలోపు దరఖాస్తులు చేసుకోవచ్చు అని గడువును నిర్ణయించింది. అయితే ఆ గడువు ఈనెల 23తో ముగుస్తున్నప్పటికి రియల్‌ఎస్టేట్ వ్యాపారులలో స్పందన కరువైంది. నుడా పరిధిలో 427 అక్రమ లేఅవుట్లు ఉన్నప్పటికి ఇప్పటికి కేవలం 188 ప్లాట్లు లేఅవుట్లదారులు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. నుడా పరిధిలోని 30 ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు ఉండగా కేవలం 14 ప్రాంతాల నుంచి మాత్రమే అరకొరగా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వీటికి కూడా ఇప్పటి వరకు క్రమబద్ధీకరణకు ఆమోద ముద్ర పడలేదు.

- **చైర్మన్ హెచ్చరికలు బేఖాతారు**

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ద్వారా నుడాకు రూ.కోట్లాది రుపాయల ఆదాయం రావాల్సి ఉంది. అలాగే ప్లాట్లు కొనుగోలుదారుల అందరికి వారి ప్లాట్లపై పూర్తి అనుమతులు ఏర్పడనున్నాయి. అయితే ఎల్‌ఆర్‌ఎస్ పథకం గడువు మరొ 15 రోజుల్లో ముగుస్తున్నప్పటికి అక్రమ లేఅవుట్‌దారుల్లో స్పందన కనబడుటలేదు. దీనిపై ఇటీవల నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పత్రికా సమావేశం ఏర్పాటు చేసి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. క్రమబద్ధీకరణకు ముందుకు రాకపోతే భవిష్యత్తులో మళ్లీ క్రమబద్ధీకరణ ఉండదని, లేఅవుట్లను ధ్వంసం చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. అయినా స్పందన నామమాత్రంగానే ఉంటుండడంతో అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. అసలు అక్రమ లేఅవుట్‌దారుల ధైర్యం ఏమిటని ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గడువు ముగిసేలోపైన అక్రమ లేఅవుట్‌దారులు దరఖాస్తులు చేసుకుంటారో లేక తమకు ఇబ్బంది ఉండదన్న భరోసాగా ఉంటారో వెచ్చిచూడాల్సి ఉంది.



ప్రమాదానికి కారణమైన కారు

అర్ధరాత్రి కారు బీభత్సం

- రెండు మోటారు బైకుల ధ్వంసం

అనంతసాగరం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట వద్ద సోమవారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. ఆత్మకూరు-సోమశిల ప్రధాన రహదారి లింగంగుంట రచ్చ వద్ద రోడ్డు మార్జిన్‌లో రెండు మోటారు బైకులు, ఒక కారు పార్క్ చేశారు. ఏపీ 39ఎల్ 07672 నెంబరు కారు వేగంగా రావడంతో అదుపు తప్పి బైకులను ఢీకొంది. దీంతో 10 నుంచి 20 అడుగుల దూరంలో బైకులు ఎగిరి పడ్డాయి. పార్కింగ్ చేసిన కారు పాక్షికంగా దెబ్బ తినింది. ఘటన స్థలంలో పెద్ద రాళ్లు ఉండడంతో వాటిని ఢీకొని కారు ఆగిపోయింది. పగలు రద్దీగా ఉన్నప్పుడు ఈ ఘటన జరిగి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని, కారు డ్రైవరును గుర్తించి పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఊటుకూరులో వ్యక్తిపై దాడి

విడవలూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలు మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిపై విచాక్షణారహితంగా దాడి చేసిన సంఘటన మండలపరిధిలోని ఊటుకూరు గ్రామం కంచరపాళెంలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు ఊటుకూరు గ్రామానికి చెందిన విడవలూరు ప్రసాద్ మద్యం సేవించి గ్రామంలో గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కొర్ర వెంకయ్య, విడవలూరు ప్రసాద్ మధ్య కొంతకాలంగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మంగళవారం వాటర్ క్యాన్ ఇంటికి తీసుకుని పోతున్న వెంకయ్యను విడవలూరు ప్రసాద్ అడ్డగించి మారణాయుధంతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకయ్యను స్థానికులు 108లో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టి కేసుని నమోదు చేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100): 530

అంబేడ్కర్‌ను అవమానపరచడం హేయమైన చర్య

బిట్రగుంట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మడ్డిగ్రీస్ పూయడం హేయమైన చర్య అని పలువురు దళిత, గిరిజన నేతలు ఆవేదన చెందారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ముఖానికి గుర్తు తెలియని వ్యక్తులు నల్లటి మడ్డిగ్రీస్ పూసిన సంఘటన మంగళవారం గుర్తించి ఎంఆర్పీఎస్ నేత యేసుపోగు జయరాజు, గిరిజన నాయకుడు బోగిరి యోహాను తదితరులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాన్ని కడిగి శుభ్రపరచి పాలభిషేకం చేశారు. ఎలాంటి అవాంఛనీ య సంఘటనలు జరుగకుండా స్థానిక ఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది చెంచులక్ష్మీపురం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కావలి రూరల్ సీఐ పాపారావు సంఘటనా స్థలాని పరిశీలించారు. జైభీం అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బీ.రవిచంద్ర, ఎంఆర్పీఎస్ నేత బుద్దయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావులు అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు.

ఆధార్ కేంద్రంలో అక్రమ వసూళ్లు!

● తనిఖీ చేసి మూత వేయించిన ఎంపీడీవో సురేష్


ఆధార్ కేంద్రంలో రసీదులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్

ఉలవపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు సచివాలయం-3లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు మంగళవారం జనసేన నాయకుడు వక్కలగడ్డ మణికంఠ పవన్‌కుమార్ ఆధారాలతో ఎంపీడీవో సురేష్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్టీలతోపాటు మండలంలో ఆధార్ కష్టాలు తీర్చేందుకు ఐటీడీఏ శాశ్వత ఆధార్ కేంద్రాన్ని మండలానికి కేటాయించగా ఎంపీడీవో వారికి అన్ని వసతులు కల్పించారు. అయితే ఉచితంగా చేయాల్సిన ఆధార్ కార్డుల బయోమెట్రిక్ అప్‌డేట్, నూతన ఆధార్ కార్డుల ఆన్‌లైన్‌కు రూ.250 వసూళ్లు చేస్తున్నారని గతంలో ఫిర్యాదులు అందాయి. అప్పట్లో ఎంపీడీవో మందలించినప్పటికీ వారిలో మార్పు రాలేదు. ఈ విషయం స్థానిక జనసేన నాయకుల వద్దకు చేరగా మంగళవారం ఆధార్ సెంటర్‌లో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేయడాన్ని నిలదీసి ఎంపీడీవోకు సమాచారం అందించారు. ఆధార్ సెంటర్‌కు వచ్చిన ఎంపీడీవో జరుగుతున్న తంతును నిర్ధారించుకుని ఐటీడీఏ అధికారులతో మాట్లాడారు. సక్రమంగా నిర్వహించలేని ఆధార్ సెంటర్ సేవలు ఆపేయమని సిబ్బంది తీరుని వివరించారు. దీంతో ఆధార్ సెంటర్ సేవలు నిలిపివేసి సంస్థతో కాంట్రాక్ట్ రద్దు చేసుకుంటామని ఐటీడీఏ అధికారులు చెప్పినట్లు ఎంపీడీవో తెలిపారు.

న్యూస్ బాక్స్

వైసీపీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించండి

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాబోయే అన్నిరకాల స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధంగా ఉండేలా గ్రామ, వార్డుస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి సమక్షంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రా మాట్లాడుతూ పార్టీ నిర్మాణం బలంగా ఉంటేనే అధికారపక్షం చేస్తున్న అవినీతిని ఎండగట్టి ప్రజలకు తిరిగి జగనన్న పాలన అందించ గలమన్నారు.

సుప్రీం కోర్టు సీజేపై దాడి హేయం

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై కోర్టు ఆవరణలోనే చెప్పు విసిరిన న్యాయవాది కిషోర్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వివిధ ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. గవాయిపై దాడిని నిరసిస్తూ మంగళవారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సంఘాలు, రాజకీయపార్టీల నేతలు పాలేటి కోటేశ్వరరావు, నేతి మహేశ్వరరావు, బూసి సురేష్‌బాబు, చింతరబోయిన నరేష్, మాధవరావు, కిరణ్, పంది కోటేశ్వరరావు, చక్కా శింగయ్య, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

● **ఉలవపాడు :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ చేసిన దాడిని చాకిచర్ల గ్రామం అంబేడ్కర్ అసోసియేషన్ యువజన సంఘం ఓప్రక టనలో తీవ్రంగా ఖండించింది. సీజేఐపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్యంపై దాడికి యత్నించినట్లేనని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బార్ కౌన్సిల్ సభ్యత్వాన్ని రద్దు చేసి, దేశద్రోహం చట్టం, అట్రాసిటి కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీజేఐపై దాడిని ఖండించిన వారిలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జూటూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శి సుదర్శి సుకుమార్, గౌరవ అధ్యక్షుడు ధన్యాసి శ్రీహరిరావు, గౌరవ సలహాదారుడు భాస్కరరావు, శ్రీనివాసులు, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

బాల్య మిత్రుడికి చేయూత

కావలి(టౌన్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దర్జీ వృత్తితో జీవిస్తున్న శివ అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమై ఇబ్బంది పడుతుండగా ఆయన బాల్య మిత్రుడు, జాగో సేవాసంస్థ అధ్యక్షుడు జమీర్ మంగళవారం పరామర్శించి బియ్యం, నిత్యావసరాలు, కొంత నగదు అందజేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఎస్‌కే ఖాదర్‌బాషా, రత్నం ఫౌండేషన్ చైర్మన్ ప్రసాదరావు, టైంటు హెల్ప్ రమేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆపదలో ఉన్న స్నేహితుడికి చేయూతనందించడం అభినందనీయమని జమీర్ స్నేహధర్మాన్ని చాటుకోవడం అభినందనీయమన్నారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్

● ఎండ, వానకు అవస్థలు పడుతున్న ప్రయాణికులు


జాతీయరహదారి నిర్మాణంలో తోలిన మట్టికుప్పలతో నిరుపయోగంగా బస్‌షెల్టర్

జలదంకి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో చినక్రాక వద్ద కావలి-సీతారామపురం జాతీయరహదారి బిజి167పై బస్‌షెల్టర్ నిరుపయోగంగా ఉంది. జాతీయ రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో సంబంధిత అధికారులు ఈ బస్‌షెల్టర్ చుట్టూ మట్టికుప్పలు పోయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినక్రాకలోని పాత పోలీసుస్టేషన్ వద్ద ఉన్న ఈ బస్‌షెల్టర్‌ను ఎన్‌హెచ్ అధికారులు వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు. వర్షాలు, మండుతున్న ఎండలకు ప్రయాణికులు నిలువ నీడలేక ఇబ్బందులు పడుతున్నారని అదేవిధంగా నిత్యం విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో బస్‌షెల్టర్ వినియోగం లేక వర్షాలకు తడుస్తూ, ఎండకు ఎండుతూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ చుట్టూ వేసిన మట్టికుప్పలు తక్షణమే తొలగించి వినియోగంలోకి తేవాలని చినక్రాక గ్రామస్థులు, తదితరులు కోరుతున్నారు.

ఏపీఎన్‌జీజీవో సభ్యత్వ నమోదు


ఎంపీడీవో కార్యాలయంలో ఏపీఎన్‌జీజీవో సభ్యత్వం తీసుకుంటున్న సిబ్బంది

కలిగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ శ్రేయస్సు కోసం ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎన్‌జీజీవో)లో సభ్యత్వం తీసుకోవాలని వింజమూరు తాలూకా ఏపీఎన్ జీజీవో అధ్యక్షుడు వెలుగోటి మధు కోరారు. మంగళవారం వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాల పరిధిలోని పలు కార్యాలయాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. నవంబరులో జరగనున్న కార్యవర్గ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భగా మండలంలోని పీహెచ్‌సీ, వెటర్నరీ, ఎంపీడీవో తదితర కార్యాలయ సిబ్బంది సభ్యత్వం తీసుకున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

● ఏడేళ్ల తరువాత బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ పూడికతీత
● ఆయకట్టు రైతుల హర్షం


బ్రాహ్మణక్రాక మేజర్ కాలువలో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్

జలదంకి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలంలోని సోమశిల రిజర్వాయరు ఆయకట్టు పరిధిలోకి వచ్చే బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ పూడికతీత పనులు గత నాలుగు రోజులుగా జోరుగా సాగుతోన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి వనరుల మరమ్మతు పనులు ఐదేళ్లపాటు గాలికొదిలేయడంతో మండలంలో అన్ని కాలువలు, చెరువులు అధ్వాన స్థితికి చేరాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి సాగునీటి వనరులను గాడిలో పెట్టింది. గత ఏడాది ప్రధాన కావలి కాలువ పూడితతీత పనులు చేపట్టగా రెండో ఏడాది మేజర్, మైనర్ కాలువ పూడికతీత పనులు మొదలు పెట్టింది. అందులో భాగంగా ఓఅండ్ఎం నిధులతో బ్రాహ్మణక్రాక మేజర్ కాలువలో నీటిసంఘం అధ్యక్షుడు చింతం శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీయిస్తున్నారు. ఈ పనులను సోమశిల డీఈ శరత్, ఏఈ నాగార్జునరెడ్డిలు పర్యవేక్షిస్తున్నారు. గతంలో సాగునీరు పొలాలకు చేరాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నామని, పూడితతీతో ఇక అలాంటి ఇబ్బందులు తీరుతాయని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా కోదండరాముడి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో సీతా సమేత కోదండరాముడు

కావలిరూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపాళెంలో జరుగు తున్న కోదండరామ స్వామి ఆలయ పునఃప్ర తిష్ఠ ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి కోదండరామ స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాల ను ప్రత్యేకంగా అలంకరించిన గజవాహ నంలో ఉంచి మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లికలు వేసి స్వామి వారికి పూజలు నిర్వహించారు. సీతారాముల వేషధారణలో భక్తుల నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. ఈ పూజల్లో ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, డీఎస్పీ శ్రీధర్, టీడీపీ నాయకులు బొట్లగుంట శ్రీహరినాయుడు, గోరంట్ల రాంబాబు, గొంది వెంకటేశ్వర్లు, పోకూరు రాంబాబు, కోడెల కృష్ణ, చిడిపోతు వెంకటే శ్వర్లు, బత్తుల రవి, మండువ శ్రీనివాసులు, కంటు రమేష్‌బాబు, మండువ వాసు, కంటు గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చౌదరిపాలెంలో పుట్టిన నాటి నుంచి అంగవైకల్యంతో మంచానికే పరిమి తమైన కోడెల సుబ్బారావు మనవడిని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పరిశీలించారు. మంచంలో ఉన్న ఆ యువకుడికి ప్రస్తుతం వస్తున్న రూ. 6000 పెన్షన్‌ను రూ.15000 పెంచి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో 12 ఏళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న పాతూరి గోపిని పరామర్శించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాలి

● ఎస్ఈ రాఘవేంద్రం

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాణ్యమైన, అంతరాయంలేని విద్యుత్ సరఫరా చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్ శాఖ అధికారులను ఎస్ఈ కే రాఘవేంద్రం ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆ బాధ్యత విద్యుత్ అధికారులు, సిబ్బందేనన్నారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ అమలును వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్ చౌదరి, బెనర్జీ, భాను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాయిపేటలో అంకమ్మ తిరణాళ్ల


అంకమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కొండాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటలో రజకులు నిర్మించుకున్న అంకమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ తిరునాళ్ల భక్తులు మూడురోజులపాటు ఘనంగా నిర్వహించారు. మూడవరోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పాలపొంగళ్లు పెట్టి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

జీఎస్టీ 2.0 సూపర్ సేవింగ్స్‌పై వ్యాసరచన పోటీ


మాట్లాడుతున్న జీఎస్టీ సహాయ కమిషనర్ వరప్రసాద్

కావలి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కావలి విద్యాశాఖ, మండల జీఎస్టీ కార్యాలయ అధికారులు పట్టణంలోని పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో, గుర్రంవారి వీధిలో ఉన్న నారాయణ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. దానిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఎంతో ప్రయోజనం

● **కావలిరూరల్ :** పేద, మధ్య తరగతి వర్గాలకు, వ్యవసాయ, విద్యా, వ్యాపార రంగానికి కేంద్ర ప్రభుత్వం అందించిన జీఎస్టీ సంస్కరణలు ఒక వరమని జీఎస్టీసహాయ కమిషనర్ వరప్రసాద్ పేర్కొన్నారు. మండలం లోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ, ఎలక్ట్రికల్, సివిల్, జనరల్ విభాగ అధిపతులు సుబ్బన్న, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణయ్య, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఆశా’లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

లింగసముద్రం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్లకు దహన సంస్కారాల ఖర్చు రూ.20 వేలు ఇవ్వాలని, మీటింగులకు వెళ్లినప్పుడు టీఏ, డీఏలు, కొత్త మొబైల్ ఫోన్లు, అన్ని రకాల సెలవులు ఉద్యోగులకు ఇచ్చినట్లుగానే ఇవ్వాలన్నారు. ఈ మేరకు సీహెచ్‌వో జీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆశా వర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాటా రమణమ్మ, కార్యదర్శిగా ఎం శ్రీలక్ష్మి, కోశాధికారిగా షేక్ ఆలీషా, కమిటీ సభ్యులుగా అనూష, పూర్ణిమ, మాధవి, గీత, లక్ష్మీదేవి, కోటమ్మ, ఈశ్వరమ్మలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కే.అంకయ్య, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● **ఉలవపాడు :** ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సెలవులు వర్తింప చేయాలని మండల సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చాకిచర్ల పీహెచ్‌సీ ముందు నిరసన తెలిపారు. ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్టుల భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని, పీహెచ్‌సీకి వెళ్లే ప్రతిసారి టీఏడీలు ఇవ్వాలని, 5జీ మొబైల్, సిమ్ కార్డు, నాణ్యమైన

● సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

యూనిఫాం, దహన సంస్కారాల ఖర్చుకు రూ.20 వేలు చెల్లించాలనే డిమాండు చేశారు. అనంతరం ఆసుపత్రి పీహెచ్ఎన్ శోభకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్, ఆశా వర్కర్స్ నాయకులు దన్యాసి కోటేశ్వరమ్మ,శ్యామల, కోటేశ్వరి, వరలక్ష్మి, ఆరుణ కొండమ్మ, సుబ్బరావమ్మ, శ్రీలక్ష్మి తదితరుల పాల్గొన్నారు.


లింగసముద్రం: సీహెచ్‌వోకి వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు


ఉలవపాడు : పీహెచ్ఎన్‌కి వినతిపత్రం అందచేస్తున్న ఆశా వర్కర్లు

ఉలవపాడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఐజీ త్రిపాఠి


పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి

ఉలవపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు రేంజీ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం రాత్రి ఉలవపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో అన్ని కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నేర పరిశోధన అవసరాన్ని బట్టి డ్రోన్ కెమెరాను, శాంతిభద్రతల విషయంలో రౌడీషీటర్లపై నిఘా ఉంచడం, మహిళల భద్రత, బెట్టింగ్ యాప్స్, దొంగతనాలు, ఫైనాన్స్ వేధింపులు వంటి నేరాలపై ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే పరిష్కరించాలని ఎస్ఐ అంకమ్మకు సూచించారు. అనంతరం స్టేషన్‌లోని సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించి సుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ అన్వర్ బాషాలు తనిఖీ సమయంలో ఐజీ వెంట ఉన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


కావలిటౌన్ : వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కావలి(టౌన్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం స్థానిక వెంగళరావునగర్‌లోని శాఖా గ్రంథాలయంలో జరిగాయి. గ్రంథాలయాధికారిణి బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు పాల్గొని ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి ధర్మ మార్గాన్ని చూపారని మనమందరం ఆయన చూపించిన మార్గాన్ని ఆచరించాలన్నారు. కోటేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శివ, కె.బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● లింగసముద్రంలో నివాళి...


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దారు కోటేశ్వరరావు, తదితరులు

లింగసముద్రం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బ్రహ్మర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పలువురు అధికారులు, నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం.కోటేశ్వరరావు, ఆర్ఐ ఎం.రమణయ్య, వాల్మీకి సంఘం నేతలు అర్థాకుల పెదసత్యం, ఏడుకొండలు, టీడీపీ నాయకులు మద్దెల రామారావు, వీఆర్‌వోలు బ్రహ్మయ్య, అమానుల్లా, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ


ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న సీఐ వెంకటరమణ

కలిగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని కలిగిరి సీఐ వెంకటరమణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో చెడు వ్యసనాల వలన కలిగే దుష్ఫలితాలపై విశ్రాంత ఉపాధ్యాయుడు నందనవనం ప్రభాకరరావు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని సీఐ మంగళవారం ఆవిష్కరించారు. రద్దీగా ఉండే ప్రదేశాలతోపాటు ముఖ్యమైన కూడళ్లలో సమాజానికి మంచిని తెలిపే విషయాలు కనిపిస్తే కొంతమందిలోనైనా మార్పు వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందనవనం ప్రభాకరరావు, స్థానికులు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలు


పోషకాహార మాసోత్సవాల్లో అంగన్‌వాడీ నిర్వాహకులు, మహిళలు

కొండాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి పంచాయతీ కుంకువారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానికంగా లభించే పదార్థాలతో తయారు చేసుకునే ఆహార పదార్థాలు, కూరగాయలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ నిర్వాహకులు అరుణ, రమాదేవి, శ్రీదేవి, ఆదిలక్ష్మి, నాగవేణి, దొరసానిలక్ష్మి, దొరసానమ్మ, ద్రాక్షాయణి. స్థానిక మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ దొంగలు దొరికిపోయారు

వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ఆ నేరాన్ని టీడీపీపైకి నెట్టేద్దామనుకున్న వైసీపీ నేతల కుట్రను పోలీసులు తిప్పి కొట్టారు.అంబేడ్కర్‌ను అడ్డుపెట్టుకుని రాజకీయ మంటల్లో చలికాచుకుందామనుకున్న నారాయణస్వామి సలహా విన్న ఈ ఘటన ముఖ్య పాత్రధారి సర్పంచ్ గోవిందయ్యను జైలుకు పంపించారు.ఎస్సీల దేవుడు అంబేడ్కర్ విగ్రహానికి అపకారం చేద్దామనుకున్న గోవిందయ్యను కఠినంగా శిక్షించాలి.బేసిక్ నాలెడ్జ్ కూడా లేని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఈ విషయంపై మాట్లాడుతున్న మాటలు జోకర్‌ను తలపిస్తున్నాయి.రూ.3,500 కోట్లు లిక్కర్‌స్కామ్‌లో నిందితుడైన నారాయణస్వామికి ధైర్యముంటే మాపై అటాక్ చేయాలి.అంబేడ్కర్ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు లేఖ రాసిన వైసీపీ ఎంపీకి నిజాయితీ ఉంటే ఈ ఘటన వెనకున్నవారిని కూడా శిక్షించాలని కోరాలి.

- మీడియా సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యేలు వీఎం థామస్, జగన్మోహన్, మురళీమోహన్, నెలవల విజయశ్రీ, యార్లగడ్డ వెంకట్రావు

వాట్ ఆర్ యూ టాకింగ్ ఎస్పీ?



దేవళంపేట ఘటనపై ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడిన తీరు ఏ మాత్రం సరికాదు.దళిత సమాజాన్ని అవమాన పరిచేలా మాట్లాడిన ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి.అరెస్టు చేసిన గోవిందయ్యను విడుదల చేయాలి. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకుడు సతీష్ నాయుడు,సర్పంచ్ గోవిందయ్య మధ్య అంబేడ్కర్ విగ్రహంపై వివాదం వుంటే ఈ కేసులో గోవిందయ్యను ఇరికించారు. ఇది స్వల్ప ఘటన అని ఎస్పీ ఎలా అంటారు? వాట్‌నాన్సెన్స్ ఆర్‌యూ టాకింగ్ ఎస్పీ?ఇదిలాగే కొనసాగితే ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులనూ డిజిటల్ బుక్‌లో ఎక్కిస్తాం.రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ లేదు. పచ్చచొక్కాలు వేసుకుని పనిచేస్తున్నారు.

- మీడియా సమావేశంలో వైసీపీ నేతలు నారాయణ స్వామి, సుధాకర బాబు

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి



వెన్నెల్లో విహరించిన వైకుంఠనాథుడు

తిరు మాడవీధుల్లో పౌర్ణమి వెలుగుల్లో శ్రీవారు మంగళవారం తన ప్రియవాహనం గరుడుడిపై విహరించారు. ప్రతినెలా పౌర్ణమిరోజున నిర్వహించే గరుడ సేవలో భాగంగా.. మంగళవారం రాత్రి మలయప్పస్వామిని విశేష అభరణాలు, పుష్పాలతో అలంకరించారు. తర్వాత గరుడ వాహనంపై కొలువుదీర్చి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మాడవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు వాహనసేవ కదులుతున్న క్రమంలో అతి దగ్గరగా ఓ శునకాన్ని గుర్తించిన అధికారులు, సిబ్బంది కంగారుపడ్డారు. వెంటనే దూరంగా తరిమారు. సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులు ఆగ్రహించినట్టు సమాచారం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

స్వగ్రామంలో సీఎం

- కుటుంబ సభ్యులతో కలిసి సోదరుడి సంవత్సరీకానికి హాజరైన చంద్రబాబు



సంవత్సరీక పూజా కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, ఇందిర, నారా లోకేశ్, గిరీష్, రోహిత్

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సోదరుడి సంవత్సరీకానికి హాజరైన సీఎం చంద్రబాబు మూడు గంటలపాటు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెలో గడిపారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనికోసం ఆయన ఉండవల్లిలోని నివాసం నుంచి హెలిప్యాడ్‌లో బయలుదేరి మంగళవారం ఉదయం 11.20 గంటలకు ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన 11.30 గంటలకు నారావారిపల్లెలోని ఇంటికి వచ్చారు. ఇంట్లో నారా రామ్మూర్తి నాయుడికి విస్తర (11వనెల బట్టలు పెట్టడం) కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12.25 గంటలకు సీఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేశ్, రామ్మూర్తి నాయుడి సతీమణి ఇందిర, కుమారులు నారా గిరీష్, నారా రోహిత్, సీఎం సోదరి హైమావతి, ఇతర కుటుంబ సభ్యులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవినాయుడు రామ్మూర్తి నాయుడి ఘాట్‌కు చేరుకుని నివాళులర్పించారు. అక్కడ్నుంచి 12.55 గంటలకు ఇంటికి బయలుదేరారు. సీఎం ఇంటి ముందున్న వందలాది మంది ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. దాదాపు అరగంట పాటు ప్రజలతో ఉన్నారు. అనంతరం ఇంటిలోపలకు వెళ్లిన ఆయన మధ్యాహ్నం 2.10 గంటలకు హెలిప్యాడ్‌కు బయలుదేరారు. ఆ సమయంలోనూ ఇంటి ముందున్న బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎ.రంగంపేట నుంచి హెలికాప్టర్‌లో సీఎం, మంత్రి లోకేశ్ ఉండవల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం సతీమణి నారా భువనేశ్వరి రోడ్డు మార్గంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదు వెళ్లారు.



రామ్మూర్తి ఘాట్ (సమాధి) వద్ద హారతి ఇస్తున్న నారా లోకేశ్, గిరీష్, రోహిత్, చిత్రంలో చంద్రబాబు, ఇతర కుటుంబ సభ్యులు



నారా రామ్మూర్తినాయుడి ఘాట్

బాగా పనిచేశారు

- కలెక్టర్‌కు సీఎం అభినందన



సీఎం చేతుల మీదుగా స్కోచ్ అవార్డు అందుకుంటున్న కలెక్టర్

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టులో భాగంగా ఢిల్లీకి చెందిన స్కోచ్ సంస్థ గోల్డెన్ పురస్కారాన్ని ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్ అందుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం నారావారిపల్లె నుంచి ఎ.రంగంపేట హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎంను కలెక్టర్ కలిశారు. మరోసారి సీఎం నుంచి స్కోచ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బాగా పనిచేశారంటూ కలెక్టర్‌ను చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనరు మౌర్య, ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ భూమనా.. మీ హయాంలో

శేషవస్త్రాలు ఎక్కడికి పోయాయి?

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): 'వారంరోజుల పాటు స్వామిపై ఉన్న శేషవస్త్రాలు మీ హయాంలో బయటకు ఎలా పోయాయి భూమన కరుణాకరరెడ్డి గారూ?' అని టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మంగళవారం తిరుమల ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చిన కారణంగా కొన్ని శేషవస్త్రాలు ఎవరికి చేరకూడదో వారికి చేరాయని భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. అవి ఎంతమందికి చేరాయో ఆ లెక్కలు కూడా త్వరలో బయటపడతాయంటూ.. దీనిపై కూడా విచారణ చేయిస్తామని భానుప్రకాష్ అన్నారు. అర్చకులు, శేషాద్రిస్వామి వంటి వారు మృతి చెందిన తర్వాత దహన క్రియలు జరిగిన అనంతరం సంప్రదాయానుసారం అక్కడికి వెళ్లి పరివట్టం కట్టే పద్ధతి ఉందని తెలిపారు. ధర్మారెడ్డి కుమారుడు చనిపోయినప్పుడు కూడా ఇలాగే జరిగిందని, అక్కడ భూమన కరుణాకరరెడ్డి కూడా ఉన్నారని చెప్పారు. శ్రీవారి ప్రతిష్ఠ, తిరుమల పవిత్రత దిగజారేలా మాట్లాడడం మానుకోవాలని భూమనకు హితవు చెప్పారు.

నేటినుంచి సహకార సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాజ్ హోటల్ వేదికగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సదస్సు జరగనుంది. సహకార రంగ బలోపేతంతో ఆర్థిక వృద్ధిని పెంపొందించడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి అశీష్‌కుమార్ భుటానియాతో పాటు వివిధ రాష్ట్రాల సహకార శాఖ ఉన్నతాకారులు,ప్రతినిధులు హాజరవుతున్నారు.ఇప్పటికే సుమారు 70 మంది ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. సదస్సు సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న సంస్కరణలు, సహకార రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఏపీ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ జైన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌ల పర్యవేక్షణలో జరిగే సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.



సహకార సదస్సుకు సిద్ధమైన తాజ్ హోటల్‌లో వేదిక

● అప్పీల్ చేసుకున్న దివ్యాంగులకు

నేటి నుంచి వైద్య పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనర్హులుగా నోటీసులు అందుకుని.. అప్పీలు చేసుకున్న దివ్యాంగ పింఛనుదారులకు బుధవారం నుంచి మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. వీరి అర్హతను పునఃపరిశీలించనున్నారు. ఎంతో మంది అనర్హులు దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలపై.. అప్పట్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనర్హులుగా గుర్తించి నోటీసులు ఇచ్చారు. తాము అర్హులమైనా నోటీసులు ఇచ్చారంటూ పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాంటి వారు 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అలా అప్పీలు చేసుకున్న వారికి తిరుపతిలోని రుయాస్పత్రి, శ్రీకాళహస్తి, గూడూరు ఏరియా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్యనిపుణులచే బుధవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా ఆస్పత్రుల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలంటూ మంగళవారం టెలికాన్ఫరెన్సులో అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంచానికే పరిమితమైన వారిని 108, 104 అంబులెన్సుల ద్వారా ఆస్పత్రికి తరలించాలన్నారు. ఆర్థోకు సంబంధించి 30 మంది, వినికిడిలోపమున్న 30, మానసిక వైకల్యం కలిగిన 20, దృష్టిలోపం ఉన్న 20మందిని పునఃపరిశీలించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆయా లబ్ధిదారులకు నోటీసులు అందించి నిర్దిష్ట సమయంలో హాజరయ్యేలా చూడాలన్నారు.

● భూం ఫట్

కొత్తగా సర్వే నెంబర్లు సృష్టించారు. అటవీశాఖ పరిధిలోని భూములను రెవెన్యూలో ఉన్నట్లు చూపించారు. పక్కరాష్ట్రానికి చెందిన వారికి పట్టాలిచ్చేశారు. ఇలా 250 ఎకరాల భూంఫట్‌కు పాల్పడ్డారు. రెవెన్యూ ఉద్యోగులా.. మజాకా అనిపించుకున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

రెవెన్యూ మాయాజాలం



అటవీ భూములకూ పట్టాలు

ఎన్నికల సమయంలో చక్రం తిప్పిన సిబ్బంది

సత్యవేడు మండలం వానెల్లూరు పంచాయతీలో సర్వే నెంబర్ 197/1లో సుమారు 252.16 ఎకరాల అటవీ భూములున్నాయి. వీటిని ఆరు భాగాలుగా విభజించి, కొత్తగా సర్వే. ఖాతా నెంబర్లు తయారు చేసి రెవెన్యూ భూములుగా రికార్డులలోకి ఎక్కించేశారు. 197/1 స్థానంలో 197/1ఏ, 197/1బీ, 197/1సీ, 197/1డీ, 197/1ఈ, 197/1ఎఫ్ అని సర్వే నెంబర్లు తయారు చేసి చెన్నైకు చెందిన ఆరుగురి పేర్లపై రికార్డులను సృష్టించారు. గుట్టుచప్పుడు కాకుండా మ్యుటేషన్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ అసలు సంగతి బయట పడడంతో విషయం ఉన్నతాధికారులకు చేరింది. ఇక్కడి రెవెన్యూ అధికారుల తీరుతో జిల్లా ఉన్నతాధికారులూ అవాక్కయిపోతున్నారు. ప్రస్తుతం ఆ సర్వే నెంబర్లను రెడ్ మార్క్‌లో పెట్టినట్లు సమాచారం. ఇందులో ఎవరి పాత్ర ఎంత మేరకు ఉందన్న విషయంపై విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

ఏ పేరు మీద ఎంతెంత?

పీ.శ్రీధరన్ (తండ్రిపేరు పద్మనాభన్) పేరు మీద సర్వే నెంబర్ 197/1ఏ లో 50 ఎకరాల 34 సెంట్లు. అమృతవర్షిణి (తండ్రి పేరు రాజ్ ఖన్నా) పేరుమీద సర్వే నెంబరు 197/1బీ లో 50 ఎకరాల 34 సెంట్లు. నవీన్ రాజ్‌ఖన్నా (తండ్రి పేరు రాజ్‌ఖన్నా) పేరు మీద సర్వే నెంబర్ 197/1సీ లో 50 ఎకరాల 34 సెంట్లు. అనురాధ జయకుమార్ (తండ్రిపేరు విజయన్ రాజశేఖర్) పేరుమీద సర్వే నెంబర్ 197/1డీలో 50 ఎకరాల 34 సెంట్లు. లతజయ్‌కుమార్ (తండ్రిపేరు జయకుమార్) పేరు మీద సర్వే నెంబర్ 197/1ఈ లో 50 ఎకరాల 34 సెంట్లు. ఆశాసురేష్ పేరుమీద సర్వే నెంబర్ 197/1ఎఫ్ లో 46 సెంట్లకు రికార్డులు సృష్టించారు. ఈ భూములను ఏకంగా అమ్ముకునేందు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

ఎప్పుడు జరిగింది?

2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ అటవీ భూములకు నకిలీ పట్టాలను సృష్టించినట్లుగా తెలుస్తోంది. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించేందుకు నాలుగు నెలల కిందట మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై సంబంధిత అధికారి క్షేత్ర స్థాయిలో విచారించగా ఈ వ్యవహారం బయటపడింది. దీంతో అప్రమత్తమయిన ఆ అధికారి జిల్లా అధికారులకు నివేదిక అందించినట్లు సమాచారం.

జరిగిందిలా..

ఈ ఘటనలో గతేడాది బదిలీల్లో భాగంగా ఎన్నికల నిర్వహణ విధుల నిమిత్తం వచ్చిన కీలకాధికారిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్లకు భూములకు సంబంధించి పట్టాలు జారీ చేయడం, మ్యుటేషన్లు చేయడం తదితరాలపై అధికారాలు ఉండవు. ఆ అధికారి డిజిటల్ సైన్‌ను ఫోర్జరీ చేసి ఇంటి దొంగలే ఈ పని చేసి ఉంటారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో దళారీల కనుసన్నల్లో మెలుగుతున్న కొందరు సిబ్బందిపాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల్లో డీకేటీ భూములకు సంబంధించిన రికార్డులు కనిపించడం లేదంటూ సమాచారం. దీనిపై ఇటీవల కార్యాలయంలో ఉన్నతాధికారులు విచారణ జరపడం గమనార్హం.

అక్రమాలపై చర్యలు తీసుకోండి

తమ పంచాయతీలో చోటు చేసుకుంటున్న భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి వానెల్లూరు వాసులు వినతులు సమర్పించారు. తమ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ మాయపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆర్డీవోను కలిసి కోరారు.







ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి

అవును.. వీళ్లు బతికే ఉన్నారు!

మానవత్వమే సిగ్గుపడే దృశ్యం ఇది. తిరుపతి రుయా ఆసుపత్రికి ఎదురుగా ఇస్కాన్ రోడ్డులోని బస్టాప్‌లో బతికున్న శవాల్లా పడివున్నారు వీరంతా. ఎవరో తెలీదు. ఎక్కడి నుంచి ఎలా వచ్చారో తెలీదు. ఎప్పుడొచ్చి ఈ నీడకు చేరారో ఏమో. మూలుగుతూ ముక్కుతూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు. మొన్న ఆరుగురు. నిన్న ఐదుగురు. ఈరోజు రాత్రికి నలుగురు మిగిలారు. వెళ్లిపోయారో, చచ్చిపోయారో తెలీదు. దూసుకుపోయే వాహనాలు.. నడచిపోయే మనుషులు.. ఎవరికీ పట్టని ఈ ప్రాణమున్న శవాలకు మంగళవారం సందెచీకటి వాలేవేళ మందుపూస్తూ, అన్నం పెడుతూ, నీళ్లు తాగిస్తూ అలిపిరి అమ్మగా పేరుపడ్డ సుజాత కనిపించారు. ఈరోజు కన్నుమూసిన వ్యక్తికి పూలమాలవేసి, దణ్ణం పెట్టుకుని ఆమె సాగనంపారు. దివ్యక్షేత్రమైన తిరుమలకు తొలిమెట్టు అయిన అలిపిరిలో ఇది సాధారణ దృశ్యం. పవిత్ర భావనతో శ్రీనివాసుడి దగ్గరకు పయనమయ్యేవారి మనసు వికలమయ్యే చిత్రం. దేవుడిమీద భారం వేసి అలిపిరికి చేరుకుని ఇలా కన్నుమూస్తున్నవారికి జానెడు నీడ, పిడికెడు ముద్ద, రోగానికి మందు ఇచ్చే విశాల హృదయం టీటీడీకి కలిగితే బావుణ్ను!



- ఆంధ్రజ్యోతి, తిరుపతి



సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం :రూ.4.16 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,773
తలనీలాలు సమర్పించినవారు: 29,100

పిరమిడ్ పార్టీకి ఎన్నికల కమిషన్ షోకాజు నోటీసులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా వార్షిక ఆడిట్, ఎన్నికల ఖర్చు వివరాలను రాష్ట్రఎన్నికల సంఘానికి సమర్పించకపోవడం వల్ల భారత ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షోకాజ్ నోటీసులు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఈ నెల 14వ తేదీ లోపు వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అన్ని రకాల ఆధారపత్రాలతో సహా రాతపూర్వకంగా వివరణ అందజేయాల్సి ఉంటుందన్నారు.

మాజీ ఆర్డీవోకు రెండ్రోజుల పోలీస్ కస్టడీ

చిత్తూరు లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ కోర్టు రెండ్రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించారు. మదనపల్లెలో జరిగిన ఫైల్స్ దహనం కేసులో గతనెల 19వ తేదీన మురళిని సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మురళిని పోలీస్ కస్టడీకి అనుతించాలంటూ సీఐడీ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు పూర్తయ్యాక.. మురళిని బుధ, గురువారాల్లో పోలీసుకస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి షేక్ బాబా జాన్ ఆదేశాలు జారీ చేశారు.

'పల్లినేని' కుటుంబానికి లోకేశ్ పరామర్శ



సుబ్రహ్మణ్యం నాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి లోకేశ్

పాకాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దివంగత టీడీపీ సీనియర్ నేత, డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడి కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఉదయం గడ్డంవారిపల్లెకు చేరుకున్నారు. సుబ్రహ్మణ్యం నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం భార్య మునిలక్ష్మి, కుమార్తెలు రేవతి, మేఘన, తల్లిదండ్రులను పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుబ్రహ్మణ్యం నాయుడు పార్టీకి చేసిన సేవలను శ్లాఘించారు. ఈ సందర్భంగా అక్కడ గ్రామస్థులను పలకరించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామరిస్తున్న మంత్రి

13 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● కారు సీజ్ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

మంగళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-పీలేరు రహదారిలో మంగళవారం ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 13 ఎర్రచందనం దుంగలును స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డికి అందిన సమాచారం మేరకు.. మంగళవారం తెల్లవారుజాము నుంచి పూతలపట్టు-పీలేరు రహదారిలో పులిచెర్ల వద్ద అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం 10.30గంటలకు పులిచెర్ల వద్ద ఏపీ 39 ఎల్ జెడ్ 9951 నెంబరు గల కారు వేగంగారావడాన్ని అధికారులు గుర్తించారు. కారును ఆపేందుకు ప్రయత్నించగా.. వేగంగా వెళ్లిపోయింది. దీంతో వాహనాన్ని వెంబడించారు. డ్రైవర్ గుడిపల్లి గ్రామం సమీపంలో కారు ఆపి పారిపోయాడు. అధికారులు కారును పరిశీలించగా 13 ఎర్రచందనం దుంగలున్నాయి. పట్టుబడిన వాహనం, దుంగల విలువ రూ.18.64 లక్షలు ఉంటుందని ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో శశికుమార్, ఎఫ్‌బీవో చంద్రబాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

మూగజీవాలకు 'సూపర్' సేవలు

తిరుపతిరూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పశు వైద్య రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. వివిధ వ్యాధులను గుర్తించడమే కాకుండా ఆధునిక పద్ధతుల్లో చికిత్సనూ అందిస్తున్నారు. ఇలాంటి వినూత్న వైద్య సేవలకు కేంద్రంగా నిలుస్తోంది ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పశు వైద్య చికిత్స సముదాయ(వీసీసీ)విభాగం. పశువులకు వచ్చే ఎన్నో వ్యాధులకు ఇక్కడ చక్కని పరిష్కారం చూపుతున్నారు.



నేటి నుంచి జాతీయ సదస్సు

వీసీసీ ఆధ్వర్యంలో శాస్త్రీయపరమైన పశువిజ్ఞానాన్ని, అనుభవాలను విద్యార్థులకు అందించేందుకు బుధవారం నుంచి రెండ్రోజులపాటు కళాశాల ఆడిటోరియంలో క్లినికల్ కేస్ వెటర్నరీ స్టూడెంట్స్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాం. ఇందులో 14టెక్నికల్ సెషన్స్ ఉంటాయి. వివిధ ఆస్త్రాల నుంచి యూజీ,పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొంటున్నారు. సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల క్లినికల్ ఎక్స్‌పోజర్, నైపుణ్యత ప్రదర్శనకు చక్కని సదస్సు వేదికవుతుంది.

- డాక్టర్ వి.వైకుంఠరావు, వీసీసీ హెడ్

అబ్బురపరిచే ఆధునిక వైద్యం

వీసీసీలో అధునాతన పరికరాలతోపాటు ఎక్స్‌రే యూనిట్, ఆపరేషన్ థియేటర్, వ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రయోగశాల, పెద్ద, చిన్న జంతువుల ఇన్‌పేషంట్ సౌకర్యం, ఆక్వాలిఫ్ట్ లాంటి సదుపాయాలున్నాయి. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకే కాదు గుర్రాలు, చిరుతలు, సింహాలు, ఏనుగులు, పక్షులకు కూడా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నారు. పెంపుడు జంతువులకు రక్తపరీక్షలు, ఎక్స్‌రే, శస్త్రచికిత్సలు, ఇతర పరీక్షలకు రుసుము చెల్లించాలి. వీసీసీలో చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. 2008లో ఈవిభాగం టీచింగ్ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌గా ఏర్పాటై 2019లో వీసీసీగా మార్పు చెందింది. తిరుపతి తాతయ్యగుంటలోని సిటీవెటర్నరీ ఆసుపత్రి, తొండవాడలో వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లోనూ పశువైద్యసేవలు అందిస్తున్నారు. అంతేకాదు యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల క్లినికల్ శిక్షణకు ఇది ప్రధానకేంద్రంగా నిలిచింది. రాయలసీమజిల్లాలో పశువైద్యానికి సంబంధించి అత్యవసర కేసులకు రిఫెరల్ గానూ కీలకభూమిక పోషిస్తోంది. కేంద్రంలో రోజూవందకు పైగా ఓపీ సేవలందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



వీసీసీ భవనం



సీఎంను కలిసి వినతులు ఇచ్చేందుకు నిరీక్షిస్తున్న ప్రజలు



మానసిక వైకల్యమున్న ఈ పదేళ్ల చిన్నారి పేరు ప్రత్యూష. నాయుడుపేట పట్టణం. తల్లిదండ్రులు లేని ఆమె.. పెద్దనాన్న సంరక్షణలో ఉంది. 90 శాతం వైకల్యమున్నా పూర్తి పెన్షన్ అందడం లేదు. దీనిపై నారావారిపల్లెలో సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేయగా.. రూ.15 వేల పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

జనం వెతలు వింటూ..

● పరిష్కారానికి హామీలిచ్చిన సీఎం

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు మంగళవారం ఉండింది మూడు గంటలే. ఆయన వచ్చింది సోదరుడి సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొనేందుకు. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన తనకోసం వచ్చిన జనం వెతలు ఓపిగ్గా ఉన్నారు. అరగంటకుపైగా వారితో మాట్లాడారు. వినతులు స్వీకరించారు. అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా చంద్రబాబుకు ఎ.రంగంపేట హెలిప్యాడ్ వద్ద స్వాగతం.. వీడ్కోలు పలికారెందరో. వీరిలో సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, చంద్రగిరి, తిరుపతి, నగరి, శ్రీకాళహస్తి, జీడీనెల్లూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, డాక్టర్ థామస్, నెలవల విజయశ్రీ, ఆదిమూలం, మురళీమోహన్, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు హేమలత, సుగుణమ్మ, నరసింహయాదవ్, డాలర్స్ దివాకర్‌రెడ్డి, రవినాయుడు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివం, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, పరసారత్నం, మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అలాగే, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్, డీఐజీ షిమోషీ వాజ్పేయి, ఎస్పీ సుబ్బరాయుడు, డీపీవో సుశీలాదేవి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో కర్ణాటక ముఠా

● చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలకు పాల్పడేది కర్ణాటక గ్యాంగ్ అని పోలీసులు గుర్తించారు. వీరు నగరాన్ని షెల్టర్ జోన్‌గా చేసుకుని చైన్ స్నాచింగ్‌ల నుంచి ద్విచక్ర వాహనాలు చోరీ చేయడం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో మహిళలు, వృద్ధుల బ్యాగులు ఎత్తుకెళ్లి ఆభరణాలు, నగదు కొట్టేస్తున్నారని తెలిసింది. వీరు ఆరు నెలలకు ఒకసారి తాము ఎంచుకున్న ప్రాంతాలకు వెళ్లి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ముఠాల కోసం జిల్లా పోలీసులు ఆరేడు నెలలుగా గాలిస్తున్నారు. తిరుపతిలో కర్ణాటకకు చెందిన దాదాపు 10 గ్యాంగుల సభ్యులు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. రెండు రోజుల తిరుపతిలో క్రితం తిరుపతిలోని పోస్టల్ కాలనీలో ఒకరు.. అలిపిరి పరిధిలోని నలుగురు మహిళల మెడల నుంచి దాదాపు 186 గ్రాముల బంగారు చైన్లు లాక్కొని పరారయ్యారు. ఈ పనికి పాల్పడింది కర్ణాటక ముఠానే అని తాజాగా భావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతి రూరల్ పరిధిలోని చిగురవాడలో ఇద్దరు మహిళల మెడల నుంచి చైన్లు లాక్కెళ్లారు. వీరు స్థానికంగా ద్విచక్ర వాహనాలు దొంగిలించి, ఇలాంటి నేరాలకు పాల్పడుతుండటంతో పోలీసులు తొలుత స్థానికులే ఈ పనికి పాల్పడినట్లు భావించారు. కానీ, విచారణలో కర్ణాటక గ్యాంగు ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని పోలీసు వర్గాలు తెలిపాయి. మరోవైపు చైన్ స్నాచింగ్ నేపథ్యంలో వాకింగ్ వెళ్లే మహిళలు ఆందోళన చెందుతున్నారు. వాకింగ్ సమయంలో విలువైన ఆభరణాలు వేసుకెళ్లొద్దని పోలీసులూ సూచిస్తున్నారు. ఈ ముఠాపై నిఘా పెట్టామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని ఓ పోలీసు అధికారి చెప్పారు.



క్యూలైన్‌లో దర్శనానికి వేచిఉన్న సర్వదర్శన భక్తులు



ఆక్టోపస్ భవనం సర్కిల్ వద్ద సర్వదర్శన అదనపు క్యూలైన్‌కు అడ్డుగా పెట్టిన బారికేడ్

తిరుమలలో అదే రద్దీ

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. తమిళులు అత్యంత పెరటాశి మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. తమ స్వగ్రామాల నుంచే తిరుమలకు కాలినడకన చేరుకుని స్వామిని దర్శించుకునే సంప్రదాయం ఉంది. సెప్టెంబరు 17వ తేదీన పెరటాశి మాసం ప్రారంభమైనప్పటికీ 25వ తేదీ వరకు భక్తుల రద్దీ మోస్తరుగానే కనిపించింది. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన 24వ తేదీతో పాటు 25 తేదీలు వీఐపీల హడావుడితో కనిపించిన క్షేత్రం.. 26 నుంచి మాత్రం భక్తులతో రద్దీగా మారిపోయింది. 27 పెరటాశి రెండో శనివారంతో పాటు మరుసటి రోజు 28న గరుడవాహనం కావడంతో ఆ మూడురోజులు తిరుమల కిటకిటాలడింది. ఆ రద్దీ ఇప్పటికీ కొనసాగుతోంది. సర్వదర్శన క్యూలైను ఆక్టోపస్ భవనం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపిస్తోంది. అర్ధరాత్రి దాటాక కూడా భక్తులు క్యూలైన్‌లోకి చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత బాటగంగమ్మ ఆలయ సర్కిల్ సమీపంలోని క్యూలైన్‌కు తాళం వేయాల్సి వస్తోంది. ఇక, అదనపు క్యూలైన్ ప్రవేశమైన ఆక్టోపస్ భవనం సర్కిల్ వద్ద బారికేడ్‌ను క్యూలైన్‌కు అడ్డుగా పెడుతున్నారు. తిరిగి అర్ధరాత్రి తర్వాత భక్తులను క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు.

- **12 రోజుల్లో 8.9 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు.**
- **అత్యధికంగా 4న 83,380.. 5న 83,412 మంది దర్శించుకున్నారు.**
- **11 రోజుల్లో 37.32 కోట్ల హుండీ ఆదాయం లభించింది.**
- **3,33,234 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.**



క్యూలైన్‌లోకి వెళ్లేందుకు పరుగులు తీస్తున్న భక్తులు



పట్టుబడిన స్మగ్లర్లు, వాహనం, దుంగలతో ఉద్యోగులు

ఎర్రచందనం పట్టివేత

భాకరాపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్మగ్లర్లతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భాకరాపేట-తలకోన మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో పూలకుంటపల్లె రోడ్డు వద్ద నిఘా పెట్టామన్నారు. ఈక్రమంలో ఓ కారును ఆపగా తమిళనాడుకు చెందిన చందురిన్ యజుమలై, తరుమాన్ సామిక్కన్ అనే స్మగ్లర్లు పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. వారిని వెంబడించి పట్టుకుని కారును తనిఖీ చేయగా ఆరు ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయన్నారు. స్మగ్లర్లపై కేసు నమోదు చేసి వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించిందని ఆయన తెలిపారు. దాడిలో ఎఫ్ఎస్‌వో సలావుద్దీన్, ఎఫ్‌బీవోలు రాజేశ్ కుమార్, ప్రదీప్ చంద్, రవి, సిబ్బంది శంకర్ రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు వివరించారు.

వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని స్విమ్స్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతికి మూలస్తంభంగా నిలిచిందన్నారు. యువత వాల్మీకి జీవితాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి గురుస్వామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లన్నీ మూత

వసతి లేక ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులు



మూతపడిన బీసీ బాలుర వసతి గృహం

తడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్షేమ హాస్టళ్లు అన్నీ మూతపడ్డాయి. విద్యార్థులు లేరనే కారణంతో వాటిని మూసివేశారు. తడలో బీసీ బాలుర, ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉండగా, మాంబట్టులో ఒక బీసీ బాలుర వసతి గృహం ఉంది. మాంబట్టులోని వసతిగృహం అద్దె భవనంలో నడుస్తుండగా, తడలోని రెండు హాస్టళ్లకు సొంత భవనాలు ఉన్నాయి. ఎనిమిదేళ్ల క్రితం ఎస్సీ బాలుర వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని మూసివేశారు. గత విద్యా సంవత్సరంలో తడ వసతి గృహంలో 60 మంది, మాంబట్టులో సుమారు 50మంది విద్యార్థులు వసతి పొందినట్లుగా రికార్డులు చెబుతున్నాయి. మాంబట్టు వసతి గృహ అధికారి అనారోగ్యంతో మరణించడంతో దానికి ఇన్‌చార్జిని నియమించారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో వసతి గృహాన్ని మూసివేశారు. ఇక తడలోని బీసీ వసతి గృహంలో రూ.3.50 లక్షలు వెచ్చించి ఆధునిక మరుగుదొడ్లు, నీటి వసతి వంటి వసతులు కల్పించారు. ఇక్కడ ఉన్న అధికారి బదిలీ కావడంతో సత్యవేడు మండలానికి చెందిన అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడా విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఈ వసతి గృహాన్ని సైతం అధికారులు మూసివేశారు.

స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.11.85 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

డక్కిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.11.85 లక్షలు లభించినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఏప్రిల్ 15నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. రూ.11,85,259లక్షల నగదు, బంగారం 0.138 కిలోలు, వెండి 0.522 కిలోలు భక్తులు కానకలు రూపంలో హుండీలో వేసినట్లు ఈవో తెలిపారు. ఈ మొత్తాన్ని డక్కిలిలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి పోలేరమ్మ దేవస్థానం ఈవో శ్రీనివాసులురెడ్డి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, స్టేట్ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో సతీష్ రెడ్డి



చెంగాళమ్మ ఆలయంలో సతీష్ రెడ్డితో ఏఎంసీ చైర్మన్ రమేష్, పక్కన టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏపీ రక్షణ, విమానయాన రంగాల గౌరవ సలహాదారు జి.సతీష్ రెడ్డి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయంలో పూజలనంతరం ఆస్థాన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. సతీష్ రెడ్డి ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు శ్రీధర్, దాము రాయల్, కొండలరావు తదితరులు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్‌ఏ సాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం, వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఎంఈవో మునిరత్నం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, జీవీ నాయుడు, సుబ్రహ్మణ్యం, బాలసుబ్రహ్మణ్యం, గీత, కృష్ణయ్య, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: మండలంలోని వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కరుణకుమారి మాట్లాడుతూ ఒకే దేశం ఒకే పన్ను నినాదంతో వచ్చిన జీఎస్టీ దేశవ్యాప్తంగా వాణిజ్యాన్ని, ఉత్పత్తి సేవల పన్ను వ్యవస్థను ఏకీకృతం చేసిందన్నారు. నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రెండు స్లాబులుగా తగ్గించిందని, ఇందులో భాగంగా నిత్యావసర వస్తువులు, మందులపై జీరో శాతం జీఎస్టీ అమల్లోకి తెచ్చిందన్నారు. అలాగే వ్యవసాయ పరికరాలపై పన్నెండు నుంచి ఐదు శాతానికి తగ్గించిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దయాకర్, సచివాలయ సిబ్బంది ఈశ్వరమ్మ, కళాశాల సిబ్బంది మల్లీశ్వరి, విజయమ్మ, శ్రీలక్ష్మి, సుబ్రహ్మణ్యం, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జమీర్‌బాషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడంతో నిత్యావసర, ఎలక్ట్రానిక్స్, వాహనాలు, రైతులకు వ్యవసాయ పరికరాలు వంటి వాటిపై ధరలు తగ్గాయన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ ఆకృతిలో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్‌శర్మ మాట్లాడుతూ జీఎస్టీ సవరణ తరువాత ప్రభావం, జీఎస్టీ స్లాబ్స్ గురించి విద్యార్థులకు వివరించారు. జీఎస్టీ 2.0గురించి ప్రజలకు వివరించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.శ్రీనివాసులు, ఏ.శ్రీనివాసులు, వెంకటయ్య, గిరిబాబు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

స్వర్ణముఖి నదిలో యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో పడి ఉదయ్‌కుమార్(35) అనే యువకుడు మృతి చెందాడు. నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీలో నివాసం ఉంటున్న ఉదయ్ కుమార్ సోమవారం ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. మంగళవారం సాయంత్రం స్వర్ణముఖినది ఒడ్డున ఉదయ్‌కుమార్ దుస్తులు ఉండటంతో అదే ప్రాంతంలో గాలించడంతో నదిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉదయ్‌కుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందాడా.. లేక ఇంకేమైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం

సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో పౌర్ణమిని పురష్కరించుకుని మంగళవారం మహా చండీ యాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తి విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన వేణుంబాక రమణారెడ్డి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు.



చండీయాగంలో ఉభయకర్త రమణారెడ్డి దంపతులు

రైల్వేస్టేషన్‌లో

నీడ కరువు

- ప్లాట్‌ఫాం నిర్వహణ అధ్వానం
- ఎండ, వానతో ప్రయాణికుల అవస్థలు





రైల్వేస్టేషన్‌లోని కొళాయి చుట్టూ పిచ్చిమొక్కలు - గడ్డి పెరిగిపోయి షెల్టర్ లేని ప్లాట్‌ఫాం

నాయుడుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వసతులు లేవు. పట్టణ పరిసర ప్రాంతాలతో పాటు సమీపంలో మేనకూరు సెజ్ ఉండటంతో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజుకు సుమారు 800 నుంచి 850 మంది ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. తద్వారా రోజుకు రూ.80వేల నుంచి రూ.90 వేల వరకు ఆదాయం వస్తుంది. స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫాంలు ఉండగా, ప్రతిరోజు దాదాపు పాతిక రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్లాట్‌ఫాంలపై గడ్డి మొలిచిపోయింది. తాగునీటి కొళాయిల వద్ద చిన్నపాటి పొదలుగా ఏర్పడడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ప్లాట్‌ఫాంపై గడ్డి పెరిగిపోయి ఉండటంతో ప్రయాణికులు రైళ్లు ఎక్కేటప్పుడు, దిగే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్లాట్‌ఫాంపై లైట్లు కూడా లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణికుల అవస్థలు పడుతున్నారు. గడ్డి కాళ్లకు తగలుకుని కొంతమంది కింద పడి గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి. ఇక రైల్వేస్టేషన్ కార్యాలయ ప్రాంతంలో మాత్రమే షెల్టర్ ఉంది. ప్లాట్‌ఫాంలపై షెడ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు వేచి ఉండడానికి నీడ కూడాలేదు. ఎండ, వానతో అవస్థలు తప్పడంలేదు. ఇదిలా ఉండగా ప్లాట్‌ఫాం చివరి భాగాలు మందుబాటులకు నిలయంగా మారాయి. కాస్త చీకటి పడితే మద్యం తాగేవారు ప్లాట్‌ఫాం చేరిపోతున్నారు. స్టేషన్‌లో ప్రయాణికులకు రక్షణ కరువైంది. తరచూ చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల ప్లాట్‌ఫాంపై నిరీక్షిస్తున్న ప్రయాణికుల నుంచి రెండు సెల్‌ఫోన్లు అపహరించారు. అలాగే ఓ ఉపాధ్యాయుడిని దుండగులు కత్తితో పొడిచిన ఘటన కలకలం సృష్టించింది. ఉన్నతాధికారులు స్పందించి రైల్వేస్టేషన్ నిర్వహణపై దృష్టి పెట్టి ప్రయాణికులకు తగిన వసతులు కల్పించడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు ఆర్‌పీఎఫ్ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.





మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట, తహసీల్దార్ కార్యాలయంలో నిలచిన వర్షపునీరు

సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో మంగళవారం సాయంత్రం ఉరుపులు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపడంతో తీవ్ర ఉక్కపోత నెలకొంది. సాయంత్రానికి కారుమబ్బులు కమ్ముకుని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురడంతో పట్టణ వీధులన్నీ జలమయంగా మారాయి. జీఎన్‌టీ రోడ్డు, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో వర్షపునీరు నిలిచింది. మురుగు కాలువలు పూడిపోవడంతో చిన్నపాటి వర్షమొచ్చిన పట్టణ వీధులన్నీ జలమయంగా మారుతున్నాయి. పలుచోట్ల కాలువలు ఆక్రమణకు గురైన మురుగునీరు పారకపోవడంతో వర్షమొచ్చిందంటే ఎక్కడి నీళ్ల అక్కడే నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. ఈదురు గాలులతో కూడిన వర్షంతో విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం కలిగింది.





ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, మాజీ ఎంపీ నెలవల, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు పాశిం, విజయశ్రీ

గూడూరు, తడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని నారావారిపల్లికి విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. నారావారిపల్లిలో సీఎం సోదరుడు రామమూర్తి నాయుడు సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం, మంత్రిని పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, విజయశ్రీ కలిశారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి హేయమైన చర్య



టవర్‌క్లాక్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

గూడూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సుప్రీంకోర్టులో జరిగిన దాడి హేయమైన చర్య అని కేవీపీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవ్యవస్థ గౌరవం కోసం ప్రజలు, సామాజిక ఉద్యమకారులందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, చంద్రయ్య, శివకుమార్, మణి, రమణయ్య, మధు, కోటేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అనాగరిక చర్య

డక్కిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన, అనాగరిక చర్యగా రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నర్సయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీస్తాయన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రామకృష్ణ విద్యాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుంకర ప్రతిమ, కమ్మిరెడ్డి, శివప్రసాద్ రెడ్డి, రాధాకృష్ణన్, యారాసి గోపి తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్సీ బల్లి



గూడూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి స్వాగతం పలికారు. చంద్రగిరి మండలంలోని నారావారిపల్లిలో సీఎం సోదరుడు రామమూర్తి నాయుడు సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్సీ స్వాగతం పలికారు.

క్రీడాసామగ్రి అందజేత



క్రీడాసామగ్రిని అందజేస్తున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసరావు, సనత్‌కుమార్‌రెడ్డి, కృష్ణ, వాసుగౌడ్, భాస్కర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రోగులకు, సిబ్బందికి హెచ్‌ఐవీపై అవగాహన కల్పించి ర్యాలీ చేశారు. హెచ్‌ఐవీపై బాధితుల పట్ల వివక్షత చూపరాదన్నారు. అలాగే పట్టణంలోని సాయినగర్, వీఎస్ఆర్ నగర్, షార్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. హెచ్‌ఐవీ నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, నవజీవన్ ఆర్గనైజేషన్ సంస్థ మేనేజర్ బాలాజి తదదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బిడ్డ జన్మించిన అరగంటలో తల్లిపాలు ఇవ్వాలని సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. మంగళవారం స్థానిక బంగారుపేట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డకు ప్రతిరోజు పాలు, గుడ్డు తినిపించాలని సూచించారు.

క్వాంటమ్‌తోనే సాంకేతిక పరిజ్ఞానం

కోట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యారంగంలో సాంకేతిక నైపుణ్యాలు కావాలంటే క్వాంటమ్ వైపు దృష్టి మరల్చాలని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ అనేబుల్డ్ అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్‌పై అధ్యాపకులు, విద్యార్థులు రీసెర్చ్ కాలర్స్‌కు అవగాహన కార్యక్రమం జరిగింది. వరంగల్ నిట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథరెడ్డి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.

నాయుడుపేట జడ్పీ బాలుర హైస్కూల్‌కు స్వచ్ఛాంధ్ర పురస్కారం



ప్రధానోపాధ్యాయురాలు మంజులకు స్వచ్ఛాంధ్ర పురస్కారం అందజేస్తున్న డీఈవో కుమార్

నాయుడుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంలో పరిశుభ్రత పాటించడంలో నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులకు డీఈవో ఏవీఎన్ కుమార్ స్వచ్ఛాంధ్ర పురస్కారం అందజేశారు.

క్రీడలతో ఆరోగ్యం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్

గూడూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల సాధన వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఆర్‌డీ ప్రభుత్వ స్టేడియంలో రాయల్ క్రికెట్ క్లబ్, చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ కప్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్రికెట్ ఆడిన క్రీడాకారులు వివిధ వృత్తుల్లో, పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారని, వారిని ఒక వేదికపైకి చేర్చి క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్‌మణి, మనపాటి రవీంద్ర బాబు, మండ్ల సురేష్‌బాబు, మునిగిరీష్, పవన్, రాజేష్, దీపక్‌ఆకాశ్, నందవరం సుబ్బారావు, కిషోర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో వైసీపీ నేతల ర్యాలీ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కోట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్, కోట, అల్లంపాడు గ్రామాల్లో మంగళవారం కార్లు, మోటారు బైకల ర్యాలీ మంగళవారం జరిగింది. అల్లంపాడు గ్రామానికి చెందిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని వైసీపీ సీఈసీ సభ్యుడిగా నియమించడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మొదటగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విద్యానగర్‌లోని గాంధీబొమ్మ, కోట క్రాస్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం, ఆర్టీసీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పించారు. విద్యానగర్ శివారు ప్రాంతం నుంచి అల్లంపాడు వరకు కార్లు, మోటారు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గజమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పెళ్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, పాదర్తి రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, సునీల్‌రెడ్డి, పాముల సురేంద్ర, కనుపూరు జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను వేధిస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

చిల్లకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గిరిజన కాలనీలో గిరిజనులను పేదరికాన్ని అడ్డం పెట్టుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి స్థానికులను ఇబ్బంది పెడుతున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు శ్రీనివాసులు, మస్తాన్ అన్నారు. మంగళవారం గిరిజన కాలనీలోని బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు.